

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 06.02.2015, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 36 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com




## గోరంత పాలనపై...
# కొండంత వ్యతిరేకత?

- ఆరు నెలల్లోనే బాబు పాలనపై అసంతృప్తి
- సొంత పార్టీలోనే నిరాశ నిస్పృహ
- మళ్లీ నమ్మి మోసపోయామంటున్న రైతులు

కేంద్రంలో గాని, రాష్ట్రంలో గాని కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కుదురుకోవడానికి ఆరునెలలన్నా పడుతుంది. ఈ ఆరునెలల్లో సమస్యలు, ఆర్థిక పరిస్థితులపై పాలకులు అధ్యయనం చేయాల్సివుంటుంది. కాబట్టి ఆరు నెలల్లోనే ప్రభుత్వాల నుండి అద్భుతాలు ఆశించ లేము. ఈ కొద్దికాలంలోనే ఆఘమేఘాల మీద తమ పనులు కాలేదని ప్రజలు ప్రభుత్వంపై అసంతృప్తి చెందేది కూడా ఏమీ ఉండదు.

రాష్ట్రంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. పరిపాలన సాగించాయి. ఏ ప్రభుత్వం మీదైనా, ఏ ముఖ్యమంత్రిమీదైనా రెండు, మూడేళ్ల తర్వాత అసంతృప్తి పెరిగేది. రాష్ట్రంలో కొందరు ముఖ్యమంత్రులు చాలా అసమర్థతతో వ్యవహరించారు. అలాంటివారి మీద కూడా చాలా ఆలస్యంగా వ్యతిరేకత వచ్చింది. కాని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు మీద అతి తక్కువ కాలంలోనే అసంతృప్తి ఏర్పడింది. ఆయన పాలనా

(మిగతా 10వ పేజీలో)



## తిరుపతిలో ఓట్లు తగ్గితే... పరపతిపోయినట్లే!
# 'దేశం'లో ఆందోళన

**తిరుపతి అసెంబ్లీ ఉపఎన్నిక ఇప్పుడు అధికార తెలుగుదేశం పార్టీకి పెద్ద సవాల్‌గా మారింది. ఎమ్మెల్యేగా వున్న వెంకటరమణ మరణంతో తిరుపతి అసెంబ్లీకి ఉపఎన్నిక అనివార్యమైంది.**

ఏ అసెంబ్లీ లేదా లోక్‌సభ స్థానంలోనైనా మరణించిన ఎమ్మెల్యే లేదా ఎంపీ స్థానంలో వారి కుటుంబసభ్యులు పోటీ చేస్తే రెండోపార్టీ పోటీ చేయకుండా వస్తుంది. ఈమధ్య ఆళ్లగడ్డ ఉపఎన్నికలోనూ ఇదే జరిగింది. కృష్ణాజిల్లా పెడన అసెంబ్లీలో మాత్రం తెలుగుదేశం ఎమ్మెల్యే చనిపోతే ఉపఎన్నికలలో ప్రతిపక్ష వైకాపా పోటీ పెట్టలేదుగాని, కాంగ్రెస్ మాత్రం అభ్యర్థిని నిలిపింది. ఇప్పుడు తిరుపతిలో కూడా వైకాపా అభ్యర్థిని పెట్టలేదు. అయితే అనూహ్యంగా కాంగ్రెస్ మాత్రం శ్రీదేవి అనే అభ్యర్థిని తెరమీదకు తెచ్చింది. మాజీఎంపీ చింతామోహన్ ఈమెను నిలబెట్టారు. కాంగ్రెస్ తరపున అభ్యర్థిని నిలబెట్టడంతో తెలుగుదేశం నాయకులు ఖంగుతిన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని పోటీ నుండి విరమింపజేసేందుకు చింతా మోహన్ ఇంటికెళ్లి ప్రాధేయపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి పోటీ నుండి తప్పుకోలేదు. ఎన్నిక అనివార్యమైంది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి గెలవడం అసంభవం.

(మిగతా 10వ పేజీలో)

# జగన్ అడుగులు ఎటువైపు?

- దీక్షలపై కాదు కేడర్‌పై దృష్టి పెట్టాలి

**రాష్ట్రంలో ప్రభుత్వం పనితీరు అధ్వాన్నంగా వుంది. అయితే ప్రభుత్వం అదృష్టం ఏంటంటే ప్రతిపక్షం కూడా అలాగే వుండడం. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రధాన ప్రతిపక్షమైన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నిన్న మొన్నటి వరకు గట్టిగా పోరాడలేకపోయింది. ప్రజల్లో ప్రభుత్వం పట్ల స్వతహాగానే అసంతృప్తి వచ్చింది. ప్రతిపక్షం దీనిని సొమ్ము చేసుకోవాలి. ప్రజలు సమస్యల్లో ఉన్నప్పుడు ప్రతిపక్షం వారి ముందుండి పోరాడాలి.**

అయితే, చాలా ఆలస్యంగా ప్రతిపక్షంలో కదలిక వచ్చింది. రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఇటీవల వైకాపా అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వై.యస్. జగన్మోహన్‌రెడ్డి పశ్చిమగోదావరి జిల్లా తణుకులో రెండురోజులు దీక్ష చేశాడు. మొన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అత్యధిక సీట్లు ఇచ్చిన జిల్లా ఇది. జగన్ ఇక్కడ చేసిన దీక్షకు జనం వేలాదిగా తరలివచ్చారంటే ప్రభుత్వం పట్ల ఏ స్థాయిలో వ్యతిరేకత వుందో అర్థమవుతుంది.

అయితే దీక్షలు చేయడంతోనే రాజకీయాలు చేస్తున్నాం, పార్టీని నడిపిస్తున్నాం అనుకుంటే పొరపాటే! ఈ దీక్షలే గతంలో జగన్ కొంప ముంచాయి. 2014ఎన్నికలకు ముందు కూడా జగన్ పలుసార్లు ప్రజాసమస్యలపై దీక్షలు చేశారు. జనం తండోప తండాలుగా వచ్చారు. ఆ జనాన్ని చూసే జగన్‌లో గెలుపుధీమా ఎక్కువైంది. జనం ఓట్లను గంపలకు ఎత్తుకుని తెచ్చి వేస్తారని భ్రమపడ్డాడు. ఈ భ్రమతోనే బూత్‌లెవల్, గ్రామస్థాయిలలో పార్టీకేడర్‌ను నిర్మించాలనే విషయాన్ని విస్మరించారు. దీంతోనే ఎన్నికల్లో జగన్ ఫెయిలయ్యాడు. అధికారానికి చేరువ కాలేకపోయాడు.

కనీసం ఇప్పుడన్నా ఆ పంథాను మార్చుకోవాలి. గ్రామస్థాయిలో కేడర్ పటిష్టంగా లేదు. ఉన్న కేడర్ కూడా నిరాశతో వుంది. నోటిదాకా

(మిగతా 10వ పేజీలో)





# ముగిసిన అతిరుద్రం

నెల్లూరుజిల్లా రాపూరు మండలం ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని కరుణామయి ఆశ్రమంలో 12రోజులుగా నిర్వహిస్తున్న అతిరుద్ర హోమం ఆదివారంతో వైభవంగా ముగిసింది. ఇందులో భాగంగా ఆశ్రమంలో పంచముఖ మరకత శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో 12రోజుల పాటు గణేషపూజ, కలశ స్థాపన, పుణ్యాహవచనం, శివగంగపూజ, దీక్ష కంకణధారణ, రుత్విక్ గరణం, శివ మహాన్యాసం, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. 11యజ్ఞగుండాల్లో 133మంది వేదపండితులు రుద్రజపాన్ని జరిపారు. ఈ హోమంతో పాటు క్షేత్రవాసి శ్రీ పెనుశిల లక్ష్మీనరశింహస్వామి హోమం, నవగ్రహ హోమం నిర్వహించారు. చివరిరోజు చండీ హోమం నిర్వహించి పూర్ణాహుతి ఇవ్వడంతో అతిరుద్రం ముగిసింది. ఈ సందర్భంగా విజయేశ్వరిదేవి మాట్లాడుతూ ఒకరు ఒకసారి రుద్రాభిషేకం చేస్తే ఒక ఆవర్తనం అంటారని, 11సార్లు రుద్రాభిషేకం చేస్తే ఏకాదశ రుద్రం అంటారని, 11మంది 11సార్లు అభిషేకం చేస్తే ఏకాదశరుద్రం అని, 121మంది వేదపండితులు 11రోజులు రుద్రంను నిత్యము పఠించి అభిషేకం చేస్తే అతిరుద్రం అంటారని భక్తులకు వివరించారు. అతిరుద్రంను దర్శించుకుంటే ఎంతో పుణ్యమన్నారు. అతిరుద్రంను తిలకించేందుకు చివరిరోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆశ్రమ నిర్వాహకులు రామమోహన్‌రావు, రేవతమ్మ, సుశీలమ్మ, భాస్కరరావు, విజయగోకుల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# జడ్పీటీసీ సభ్యులకు శిక్షణ



రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణా తరగతులలో పాల్గొనేందుకు నెల్లూరు జిల్లాకు చెందిన జడ్పీటీసీ సభ్యులు ఆదివారం రాత్రి బయలుదేరి వెళ్లారు. నెల్లూరుజిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నుంచి ప్రత్యేకబస్సులో బయలుదేరిన జడ్పీటీసీ సభ్యులకు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సిఇఓ జితేంద్రలు దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేశారు.

## జర్నలిస్ట్ హెల్త్‌కార్డుల జివో విడుదల చేయాలి

రాష్ట్రంలోని జర్నలిస్ట్‌లకు హెల్త్‌కార్డులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నా, ఇప్పటివరకు అందుకు సంబంధించిన జివో విడుదల చేయనందున జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని జర్నలిస్ట్ యూనియన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వి.రామచంద్రమూర్తి, జిల్లా అధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ, నాయకులు పి.రవి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు.


5వ వర్ధంతి



మా ఇంటి దైవం,
మంచి మనసున్న మనిషి
కీ॥శే॥ చేశెట్టి రమేష్‌బాబు గారు
మమ్ము వీడి దైవసన్నిధికి చేరి
5 సంవత్సరాలు గడిచినా...
వారి స్మృతులను స్మరించుకుంటూ...
5వ వర్ధంతి నాడు అశ్రునయనాలతో
శ్రద్ధాంజలి ఘటిస్తూ...

కీ॥శే॥ చేశెట్టి రమేష్‌బాబు
(ప్రొ: CVG Pipes, Gudur)
మాజీ సర్పంచ్, నెల్లటూరు
మరణం : 8.2.2010

భార్య : చేశెట్టి జమునారాణి
మాజీ మున్సిపల్ కౌన్సిలర్, గూడూరు

తల్లి : చేశెట్టి మనోహరమ్మ
కుమారులు : చేశెట్టి పవన్‌కుమార్ - కోడలు : ప్రియాంక
చేశెట్టి మోహన్ వంశీకృష్ణ - -
కుమార్తె : మాధవి - అల్లుడు : రవికాంత్
మనుమరాండ్రు : కీర్తన, నిమిష మరియు CVG స్టాఫ్


సింహపురి సమాచారం

### 28 నుంచి

# కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాలు

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బిలకూట క్షేత్రమైన కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి కన్నుల పండువగా ఆరంభం కానున్నాయి. ఆ మేరకు ఈ నెల 7వ తేదిన పలుశాఖలకు సంబంధించిన అధికారులందరూ సమావేశమై బ్రహ్మోత్సవ ఏర్పాట్లను గూర్చి చర్చిస్తారు. కావలి ఆర్డీఓ లక్ష్మీనరసింహం అధ్యక్షతన ఆలయ ప్రాంగణంలో ఈ నెల 7న సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఆలయ ఇ.ఓ డి. వెంకటేశ్వర్లు, కావలి డివిజన్‌లోని బోగోలు మండలంలోని పలువురు అధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు.

### కన్నుల పండువగా

# శ్రీ శ్రీనివాసుని తెప్పోత్సవం

కావలి సమీపంలోని ముసునూరు గ్రామంలో వెలసి వున్న శ్రీ హనుమత్ క్షేత్రంలో కొలువైవున్న శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా, ఆదివారం స్వామివారికి వైభవంగా తెప్పోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి తోమాల సేవ, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తులను శోభాయమానంగా అలంకరించి, వేద పండితులు తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# తీరం చేరిన తిమింగలం

ఇందుకూరుపేట మండలంలోని రాముడుపాలెం సముద్రతీరానికి ఆదివారం ఉదయం సుమారు అయిదున్నర అడుగులున్న ఓ భారీ తిమింగలం కొట్టుకు వచ్చింది. మృతిచెంది వున్న ఈ తిమింగలాన్ని మత్స్యకారులు గుర్తించారు. ఇది భారీ తిమింగలం కావడంతో మత్స్యకారులు దీనిని చూసేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

# బుచ్చిలో జపాన్ బృందం

నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలంలో సోమవారం జపాన్‌కు చెందిన టుబోటో కంపెనీకి చెందిన అయిదుమంది ప్రతినిధులతో కూడిన బృందం పర్యటించింది. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయాధికారి నీరజతో వారు సమావేశమయ్యారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతి ఏమేరకు దిగుబడి ఇస్తుందో అని బృంద సభ్యులు వ్యవసాయాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నీరజ మాట్లాడుతూ రైతులను చైతన్యపరచి ఇప్పటికే యాంత్రీకరణపై దృష్టి సారించేలా చేసామన్నారు. యాంత్రీకరణతో ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయన్నారు. టుబోటో పరికరాలను అందుబాటులో ఉంచాలని ఆమె బృంద సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో భారత్ కిసాన్ సేవా సంఘం ప్రాజెక్ట్ మేనేజర్ హరికృష్ణ, డీలర్ మురళీమోహన్‌రెడ్డి, ఏఇఓలు అనూష, ఆసిమా పాల్గొన్నారు.

# జగన్ రైతుదీక్ష విజయవంతం

### - సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి

రైతుల అభ్యున్నతి కోసం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తణుకులో రెండురోజుల పాటు చేపట్టిన రైతుదీక్ష కార్యక్రమం విజయవంతమైందని, ఈ దీక్షకు రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఉప్పెనలా తరలివచ్చారని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు.

సోమవారం పొదలకూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రూ. 10లక్షలతో నిర్మించనున్న ఎమ్మార్సీ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ప్రభుత్వం రుణమాఫీ పేరుతో ప్రజలను మభ్యపెడుతోందని, ప్రభుత్వ వైఫల్యాలపై జగన్ అలుపెరుగని పోరాటం చేస్తున్నారని అన్నారు. కార్యాలయాలకు భవనాలను మంజూరు చేస్తున్న ప్రభుత్వం, అందులో సామగ్రి ఏర్పాటుకు కానీ, సిబ్బంది నియామకానికి గానీ ఎలాంటి శ్రద్ధ తీసుకోవడం లేదని విమర్శించారు. సాగునీటి ఇబ్బందులతో రైతన్నల కష్టాలు వర్ణనాతీతంగా వున్నాయని, అనేక ప్రాంతాల్లో వేసుకుని వున్న వరిపైరు ఎండిపోతుండడంతో రైతుల బాధలు వర్ణనాతీతమన్నారు. ఇకనైనా రైతుల సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం, అధికారులు అందరూ కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపిపి కోనం బ్రహ్మయ్య, ఎంపిడిఓ సిహెచ్ శ్రీహరి, పిఆర్ ఎ.ఇ చంద్రశేఖర్, పొదలకూరు సర్పంచ్ తెనాలి నిర్మలమ్మ, ఎంపిటిసి సభ్యులు కె.సులోచన, స్థానిక నాయకులు ఏనుగు శశిధర్‌రెడ్డి, వైఎస్సార్సీపి మండల అధ్యక్షులు పెదమల్లు రమణారెడ్డి, మండల రైతు విభాగం కన్వీనర్ నోటి మాలకొండారెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, స్టీరింగ్ కమిటీ సభ్యులు పులి సుబ్బారెడ్డి, పామూరు లచ్చారెడ్డి, బి. దయాకర్, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, చిల్లకూరు వెంకురెడ్డి, నెట్టెం కృష్ణమనాయుడు, వాకాటి శ్రీనివాసులురెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వైన్‌ఫ్లూపై అవగాహన పెంచుకోండి





సదస్సులో ప్రసంగిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరురూరల్ మండలం అల్లీపురంలోని సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల స్వైన్‌ఫ్లూపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశంపార్టీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ స్వైన్‌ఫ్లూ విషయంలో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, వ్యక్తిగత శుభ్రతతో, అవగాహనతో వ్యాధి నుంచి దూరంగా ఉండవచ్చని తెలిపారు. హోమియో మందులను వైద్యుల సూచనతో చిన్నారులకు అయిదు, పెద్దవారికి పది గుళికలు చొప్పున మూడు రోజులు క్రమం తప్పకుండా తీసుకుంటే ఈ వ్యాధి దరిచేరకుండా జాగ్రత్త వహించవచ్చన్నారు. ఈ సందర్భంగా అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమేష్ విద్యార్థులకు స్వైన్‌ఫ్లూపై అవగాహన కల్పించారు. అనంతరం సోమిరెడ్డి విద్యార్థులకు హోమియోపతి మందులు పంపిణీ చేశారు.

# ప్రపంచ దేశాల్లో మహాత్ముడిగా గాంధీజీకి గుర్తింపు

### - రాజీవ్ విద్యామిషన్ ప్రొఫెసర్ కోటేశ్వరప్రసాద్

ప్రపంచ దేశాల్లో మహాత్ముడిగా గాంధీజీకి గుర్తింపు వుందని ఢిల్లీకి చెందిన రాజీవ్‌విద్యామిషన్ ప్రొఫెసర్ కోటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలో గతనెల 30వతేదీ గాంధీ వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ భారతదేశంలో మహాత్మాగాంధీకి రెండుచోట్ల గుడి కట్టించారని తెలిపారు. గాంధీజీపై ఎందరో రీసెర్చ్‌లు చేశారన్నారు. ఇంకెవ్వరిపై ఇన్ని రీసెర్చ్‌లు చేయలేదన్నారు. 1918 నుండి గాంధీని మహాత్ముడని పిలిచేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి చంద్రమౌళి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, తహశీల్దార్ జి.వెంకటేశ్వర్లు, ఎంఇఓ శ్రీహరిబాబు, ఎపిఎం అక్కిశెట్టి సుజాతలు పాల్గొని గాంధీజీకి ఘన నివాళులర్పించారు. ఆశ్రమం కన్వీనర్ గణేశం కృష్ణారెడ్డి, ఆశ్రమ సంరక్షకులు నేదురుపల్లి సుబ్బారెడ్డి, నెల్లూరు రవీంద్రరెడ్డి, రొంపిచెర్ల శివరామయ్య, గూడూరు లక్ష్మి, సిహెచ్ వెంకటేశ్వర్లు, కాళిదాసు పురుషోత్తం, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, డా॥ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బందికి మూడు ఆసుపత్రులు

పోలీసు సిబ్బందికి నగదు రహిత చికిత్సలు చేయించుకునేందుకు కొత్తగా నెల్లూరుజిల్లాలో మరో మూడు ఆసుపత్రులు అందుబాటులోకి వచ్చాయని పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.ప్రసాదరావు తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సింహపురి సూపర్‌స్పెషాలిటీ, స్మైల్ డెంటల్, సింహపురి డెంటల్ ఆసుపత్రుల్లో ఇకపై పోలీసు సిబ్బంది చికిత్సలు చేయించుకోవచ్చని తెలిపారు. ఈ విషయంపై గతంలో డిజిపి దృష్టికి తీసుకుపోగా డిజిపి చొరవతో పోలీసు సిబ్బందికి ఈ సదుపాయం కలిగిందన్నారు. పోలీసు సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# డాక్టర్ ఎల్లాప్రగడకు 'భారత రత్న' ప్రకటించాలి

## - పద్మభూషణ్ డాక్టర్ కెఐ వరప్రసాదరెడ్డి



మానవాళిని బాధిస్తున్న పలు ప్రమాదకరమైన రోగాలను నివారించేందుకు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు చేసిన కృషి అనితరసాధ్యమైనదని, తన అద్భుతమైన మేధాశక్తితో ఆయన ఎనిమిది రకాల మందులను కనుగొని, 'మందుల మాంత్రికుడు'గా విఖ్యాతిగాంచారని, ప్రజలను రోగాల బారి నుంచి కాపాడిన ఆ మహనీయుని సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఆయనకు 'భారతరత్న' ప్రకటించాలని శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మభూషణ్ డాక్టర్ కెఐ వరప్రసాదరెడ్డి విజ్ఞప్తి చేశారు.

నెల్లూరు సమీపంలోని నారాయణ వైద్యకళాశాల సమావేశ మందిరంలో జనవరి 31న డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు ఫౌండేషన్‌వారి ఆధ్వర్యంలో, ఎంతో విశిష్టమైన డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు అవార్డు–2015ను డాక్టర్ కెఐ వరప్రసాదరెడ్డికి బహుకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరప్రసాదరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఎల్లాప్రగడ కనుగొన్న అనేక మందులు నేటికీ రోగార్తులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి అమెరికాలో పరిశోధనలు జరిపి డాక్టర్ ఎల్లాప్రగడ రోగార్తుల కోసం ఎంతో విశిష్టమైన మందులను రూపొందించారని అన్నారు. ఆయన పరిశోధనా తీరు, జీవన విధానం ఎంతో ఆదర్శమన్నారు. వైద్య రంగంలో విశిష్టమైన పరిశోధనలు జరిపి, మానవాళికి మహోన్నతమైన సేవలందించిన డాక్టర్ ఎల్లాప్రగడ సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన రుషితుల్యుడని, ఆయన సేవలను ప్రభుత్వం గుర్తించాలని డాక్టర్ వరప్రసాదరెడ్డి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

డాక్టర్ ఎల్లా ప్రగడ ఫౌండేషన్ ఛైర్మెన్, ప్రఖ్యాత ప్రత్యామ్నాయ ఇంధన వనరుల శాస్త్రవేత్త డాక్టర్ ఎ. జగదీష్ మాట్లాడుతూ ఫౌండేషన్ స్థాపన, ఆశయాలను, అవార్డుల విశిష్టతను వివరించారు. డాక్టర్ ఎల్లాప్రగడ నుంచి స్ఫూర్తిని పొంది, ఆయన అడుగుజాడల్లో నడచిన డాక్టర్ వరప్రసాదరెడ్డి, దేశంలోని బయోటెక్నాలజీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని డాక్టర్ జగదీష్ పేర్కొన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో దేశంలో తొలిసారిగా హెపటైటిస్–బి వ్యాక్సిన్‌ను డాక్టర్ వరప్రసాదరెడ్డి అభివృద్ధిపరచారని, శాంతా బయోటెక్నిక్స్ వారు రూపొందించిన వ్యాక్సిన్‌లు సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో వుండే ధరలకు లభిస్తున్నాయని, ఆ విధంగా డాక్టర్ వరప్రసాదరెడ్డి ఎంతో సామాజిక సేవ చేస్తున్నారని, మరోవైపు కళా సాంస్కృతిక రంగంలో ఆయన చేస్తున్న కృషి అపారమైనదనీ ప్రశంసించారు. అనంతరం ఫౌండేషన్ తరఫున డాక్టర్ వరప్రసాదరెడ్డికి డాక్టర్ ఎల్లాప్రగడ అవార్డును బహుకరించి, సన్మానపత్రం, పూలమాలలతో అతిధులంతా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ మోహనరావు మాట్లాడుతూ డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు గొప్ప దార్శనికులని కొనియాడారు. డాక్టర్ ఎల్లాప్రగడ సేవలు అందరికీ మార్గదర్శకమన్నారు. నారాయణ వైద్యసంస్థల డైరెక్టర్ డాక్టర్ జి.వి సుబ్రహ్మణ్యం, దూరదర్శన్ ప్రయోక్త, న్యూస్ రీడర్, డాక్టర్ ఎల్లాప్రగడ కుటుంబ సభ్యురాలు శ్రీమతి శోభాశంకర్ పాల్గొని వైద్య రంగంలో డాక్టర్ ఎల్లాప్రగడ చేసిన సేవలు ఎంతో విశేషమైనవని, విశిష్టమైనవనీ ప్రశంసించారు. తొలుత , నెల్లూరు విఆర్ కళాశాల ఫిజిక్స్ రీడర్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం సభకు స్వాగతం పలికి, అతిధులందరినీ వేదికపైకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం, డాక్టర్ ఎల్లాప్రగడ చిత్రపటానికి అతిథులు, ప్రముఖులు అందరూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు, పలువురు వైద్యులు, స్థానిక ప్రముఖులతో పాటు వైద్యకళాశాల విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# నెల్లూరులో స్పోర్ట్స్ యూనివర్శిటీ

## - జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్



పోటీలను ప్రారంభిస్తున్న జేసీ ఇంతియాజ్

నెల్లూరులో స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని, అందుకు అవసరమైన స్థల సేకరణ జరుగుతోందని జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ వెల్లడించారు. నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలోని ఇండోర్‌స్టేడియంలో రెండురోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి రిపబ్లిక్ డే బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ఆదివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రీడా ప్రగతికి అవసరమైన సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఇందుకు అవసరమైన 125 ఎకరాలను అధికారయంత్రాంగం సేకరించేందుకు కృషి చేస్తున్నదని తెలిపారు. క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో నగరానికి సమీపంలోని ఆమంచర్ల వద్ద 150 ఎకరాల స్థలం సేకరించామన్నారు. ఈ ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడాప్రాంగణం ఏర్పాటు కానున్నదని, వీటన్నిటి ద్వారా సింహపురి క్రీడాహబ్ కానుందని అన్నారు. డిప్యూటి మేయర్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి అసోసియేషన్ కృషి చేస్తోందని, ప్రతి వేసవి సెలవుల్లోనూ బ్యాడ్మింటన్ పోటీలను, ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను కూడా గత ఆరేళ్ళుగా ప్రతిఏటా నిర్వహిస్తున్నామని వివరించారు. పోటీలకు సహకారం అందిస్తున్న హోటల్ అతిథి గ్రాండ్ అధినేతలు జి.శ్రీకాంత్, ఇ.సురేష్ కుమార్, ఇంకా మల్లి, గౌతం, విక్రమ్‌లను ఈ సందర్భంగా డిప్యూటి మేయర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఓ యతిరాజ్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, సహాయ కార్యదర్శి వెంకట్, సభ్యులు మల్లికార్జునరెడ్డి, డాక్టర్ రామలింగారెడ్డి, అర్జున్‌రావు, ఆనంద్, చంద్రారెడ్డి, తులసి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం జరిగిన ముగింపుసభలో విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది.


అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్
ఇప్పుడు నెల్లూరులో




అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చరిత్రలో మరో మైలురాయిగా అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్ @ నెల్లూరును చెప్పుకోవచ్చు. ఇక్కడ వివిధ వైద్య విభాగాలైన న్యూరాలజీ, ట్రామా, కార్డియోథొరాసిక్ మరియు కార్డియాలజీలు అత్యాధునిక సౌకర్యాలతోకూడిన సేవలను అందించుటకై ప్రత్యేక దృష్టితో తీర్చిదిద్దబడ్డాయి. ఈ గ్రూపులో అంతర్గత విభాగంగా 189 పడకలతో అత్యద్భుతమైన మౌలిక సదుపాయములు, ఆధునిక సాంకేతిక మరియు ప్రపంచస్థాయి వైద్య నిపుణులతో, పరిపూర్ణమైన సంతుల్యతతో రోగులకు అత్యున్నత ప్రమాణాలతో చికిత్స అందించబడుతుంది.

**అందిస్తున్న వైద్యసేవలు**

**కేంద్రీకృత ప్రత్యేకతలు**
- కార్డియాలజి మరియు కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్సలు
- న్యూరాలజి & న్యూరోసర్జరీ
- ఎముకలకు ప్రత్యామ్నాయ సర్జరీ
- క్రిటికల్ కేర్ మెడిసిన్
- అత్యవసర మరియు ట్రామా సేవలు

**ఇతర ప్రత్యేకతలు**
- అలెర్జీ & అనెస్థీషియాలజి
- డెంటిస్ట్రీ
- యురాలజి & నెఫ్రాలజి
- ఎండోక్రినాలజి/డయాబెటాలజి
- ఇ ఎన్ టి
- గ్యాస్ట్రోఎంటరాలజి – మెడికల్ & సర్జికల్
- జనరల్ మెడిసిన్ & సర్జరీ
- ఆప్తమాలజి
- పీడియాట్రిక్స్
- రెస్పిరేటరీ మెడిసిన్
- రుమటాలజి
- వాస్కులర్ సర్జరీసేవలు

**సహాయక సేవలు**
- రేడియాలజి & ఇమేజింగ్
- లేబరేటరీ–బయోకెమిస్ట్రీ,హెమటాలజి, మైక్రోబయాలజి
- బ్లడ్‌బ్యాంక్
- ఫిజియోథెరపీ మరియు రిహాబిలిటేషన్
- ప్రివెంటివ్ హెల్త్ చెక్స్- డబ్ల్యుబి, ఎంహెచ్‌సి, ఈహెచ్‌సి, హెచ్‌సి, డబ్ల్యుబిసి, డబ్ల్యుడబ్ల్యుసి, సిహెచ్‌సి
- ఫార్మసీ
- అంబులెన్స్ సేవలు

The Emergency Specialist
DIAL 1066
Saving time. Saving lives.

అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్
నెం.16/111/1133, ముత్తుకూరు రోడ్డు, పినాకిని నగర్,
నెల్లూరు – 524 002, ఆంధ్రప్రదేశ్.
ఫోన్: 0861-333 7 333
సెల్: 76600 99991 / 76600 18707

Apollo SPECIALITY HOSPITALS TOUCHING LIVES

Follow us on TheApolloHospitals HospitalsApollo apollohospitalsindia
www.apollohospitals.com

## 'ప్రభా'తం

# ఫలించిన దౌత్యం



*భారత విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ జరిపిన చర్చలు ఫలవంతం కావడం చైనా-భారత్‌ల మైత్రీ యాత్రలో మరో ముఖ్యమైన ఘట్టమనే చెప్పాలి. అంతేకాదు, సిక్కిం మీదుగా మానస సరోవర్‌కు వుండే రెండవ మార్గాన్ని వినియోగించుకునేందుకు చైనాని ఒప్పించడం అనేది భారత్ దౌత్యపరమైన విధానాల్లో మరో చరిత్రాత్మక ఘట్టమనే చెప్పాలి. మొత్తంగా ఈ సత్ఫలితాలన్నిటికీ ప్రధాన కారణం ప్రధాని నరేంద్రమోదీ దౌత్య కౌశలమేనని వేరే చెప్పనక్కర లేదు.*

సయోధ్యతో సాధించలేనిదేమీ లేదనేందుకు ఇటీవల బీజింగ్‌లో జరిగిన రష్యా, భారత్, చైనా (ఆర్‌ఐసి) సమావేశం ఒక తాజా ఉదాహరణ. ఉగ్రవాదంపై పోరుకు సమాయత్తం కావాలంటూ ఈ సమావేశంలో మూడు దేశాలు ఒక తీర్మానానికి రావడం సంతోషదాయకం. ఉగ్రవాద దాడులకు పాల్పడేవారితో పాటు, ఉగ్రవాదాన్ని పెంచిపోషించేవారిని చట్టం ముందుకు తీసుకురావాలని ఈ సమావేశం కోరుతూ తీర్మానించడం ఉగ్రవాదంపై పోరుకు ఒక ముందడుగు అని చెప్పవచ్చు. ఇది ఎంతైనా శుభ పరిణామమే. ఇదే సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మన దేశానికి సంబంధించిన పలు అంశాలపై భారత విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్ జరిపిన చర్చలు ఫలప్రదం కావడం ఆనందదాయకం. చైనా-భారత్‌ల ద్వైపాక్షిక సంబంధాల్లో నూతన పురోగతికి ఈ చర్చల ద్వారా మార్గం మరింత సుగమం అయినట్లేనని భావించవచ్చు. అందుకు, ఇదొక శుభ సంకేతమనే చెప్పాలి. అందులోనూ ప్రోటోకాల్‌ను సైతం పక్కనపెట్టి, మన విదేశాంగ మంత్రితో చర్చలు జరిపేందుకు చైనా అధ్యక్షుడు ముందుకు రావడం, ఈ చర్చల్లో, గతంలో భారత్‌తో చేసుకున్న ఒప్పందాల్లోని కొన్నిటిని అమలుచేసేందుకు చైనా అంగీకరించడం చైనా-భారత్ స్నేహయాత్రలో మరో మేలు మలుపేనని చెప్పవచ్చు. ముఖ్యంగా, సిక్కిం మీదుగా కైలాస మానససరోవర్ యాత్రకు వున్న అడ్డంకులను తొలగించేందుకు చైనా సంసిద్ధత వ్యక్తం చేయడం ఎంతైనా విశేషమే. ఎందుకంటే, సముద్రమట్టానికి దాదాపు 15వేల అడుగుల ఎత్తున వున్న మానస సరోవర్‌ను దర్శించుకోవాలంటే యాత్రికులకు ఎంతో కష్టసాధ్యమవుతున్న విషయమని అందరికీ తెలిసిందే. నేపాల్ మీదుగా మానససరోవర్‌ను చేరుకునేందుకు యాత్రికులు పడే కష్టాలు వర్ణనాతీతం. అయితే, సిక్కిం మీదుగా యాత్ర చేయడం వల్ల యాత్రికులకు కొంత వెసులుబాటుతో పాటు, వ్యయప్రయాసలూ బాగా తగ్గుతాయి. కానీ, ఈ మార్గంలో యాత్రకు ఎంతోకాలం నుంచి చైనా అభ్యంతరం చెప్తుండడం వల్ల సిక్కిం మీదుగా మానససరోవర్ యాత్ర అనే అంశం, ఏళ్ల తరబడిగా కేవలం ప్రతిపాదనగానే నిలిచిపోయింది. ఇప్పుడు తాజాగా సుష్మాస్వరాజ్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరిపిన చర్చలు ఫలించడంతో, మానస సరోవర్‌యాత్రకు వున్న మరో అనువైన మార్గాన్ని వినియోగించుకునేందుకు, ఎన్నో ఏళ్ళుగా వున్న అడ్డంకులు తొలగిపోయినట్లయింది. ఈ నిర్ణయం..ఎంతో కష్టసాధ్యమైన కైలాసగిరి, మానస సరోవర యాత్రకు వెళ్ళే యాత్రికులందరి మనసులను ఆనందంతో పులకింపజేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

అటు అమెరికాతో అణు ఒప్పందంలో వున్న అడ్డంకులను తొలగించేందుకు, ఇటు మానస సరోవర్ రెండవ మార్గం విషయంలో చైనాని ఒప్పించేందుకు భారత్ చేసిన కృషి అమోఘమైనదనే చెప్పాలి. భారత్ దౌత్యపరంగా అనుసరిస్తున్న స్పష్టమైన-స్వచ్ఛమైన విధానాలే ఇందుకు దోహదం చేస్తున్నాయని చెప్పవచ్చు. మొత్తంగా ఈ సత్ఫలితాలన్నిటికీ ప్రధాన కారణం ప్రధాని నరేంద్రమోదీ దౌత్య కౌశలమేనని వేరే చెప్పనక్కర లేదు. అటు అగ్రరాజ్యమైన అమెరికాతోనూ, ఇటు పొరుగుదేశమైన చైనాతోనూ, అదేవిధంగా ఇతర ఇరుగు పొరుగు దేశాలతోనూ ప్రధాని మోడీ అనుసరిస్తున్న దౌత్యవిధానాలు, ఎంతో నిర్దిష్టంగా, సకల జనామోదకరంగా, ఆచరణాత్మకంగా తీసుకుంటున్న నిర్ణయాలు ఆయా దేశాలకు స్నేహవారధులు కడుతున్నాయి. సరికొత్త బంధాలను అనుబంధాలను ప్రోదిచేస్తున్నాయి. దేశభక్తితో, ప్రగతి శీలతతో, మానవీయతతో, స్వచ్ఛమైన విధానాలతో అందరితో మైత్రీభావం కొనసాగిస్తూ, ఇటు దేశ ప్రగతికే కాక, అటు ప్రపంచశాంతికి, సకల మానవాళి అభ్యుదయానికీ మార్గదర్శకమైన రీతిలో దౌత్యపరమైన విధానాలు సాగించడంలో ప్రధాని నరేంద్రమోడీ, ఎన్డీఏ ప్రభుత్వం సాగిస్తున్న కృషి అనితరసాధ్యమైనదనే చెప్పాలి.

అంతేకాదు, ఉగ్రవాదంపై అంతర్జాతీయ స్థాయిలో పోరు సాగించాలనే తీర్మానంపై భారత్‌తో పాటు, చైనా, రష్యా కూడా ఏకీభవించి ఒక అంగీకారానికి రావడం సుష్మాస్వరాజ్ బీజింగ్ పర్యటనలో మరో ముఖ్య ఘట్టంగా చెప్పవచ్చు. భారత్, చైనా, రష్యా విదేశాంగ మంత్రులు బీజింగ్‌లో ఇటీవల మూడు రోజుల పాటు జరిపిన చర్చల్లో జరిగిన ఈ కీలకఘట్టం కూడా ప్రాధాన్యత సంతరించుకున్నదే. ఉగ్రవాదంపై పోరుకు తొలి నుంచి భారత్ వైఖరి ఒకటే అయినప్పటికీ, ప్రత్యేకించి చైనా, రష్యాలు ఎంతోకాలం తర్వాత ఈ తీర్మానాన్ని సమర్ధించడం ఎంతైనా చారిత్రాత్మకమేనని భావించవచ్చు. ఈ నేపథ్యంలో, ప్రధాని నరేంద్రమోడీ కూడా వచ్చే నెలలో చైనాలో పర్యటించేందుకు సమాయత్తమవుతుండడం విశేషం. దీంతో, భారత్-చైనాల మైత్రి మరింత దృఢతరం అయ్యేందుకు ఇరు దేశాలూ ఆసక్తిని ప్రదర్శిస్తుండడం, రానున్న రోజుల్లో మంచి మార్పుకు శ్రీకారం చుట్టవచ్చని భావిస్తున్నారు. చైనా-భారత్ ఇరుదేశాల మధ్య ఎంతోకాలంగా సరిహద్దు సమస్యలు వుండడం, తదితర సమస్యలన్నిటినీ సంయమనంతో చర్చించుకుంటాయని భావిస్తున్నారు. అందులోనూ ప్రధాని నరేంద్రమోడీ సముచిత నిర్ణయాలు చైనా-భారత్ స్నేహసంబంధాలను మరింత పటిష్టవంతం చేస్తాయని, తద్వారా మైత్రీభావంతో నూతనాధ్యాయానికి శ్రీకారం చుట్టగలరనే విశ్వాసం అందరిలోనూ కనిపిస్తోంది. ఏదేమైనా, సమస్యలన్నిటినీ సామరస్యంగా పరిష్కరించుకుని, ప్రపంచ ప్రగతికి అందరూ బాటలు వేయాలి. సకల మానవాళి మహోదయానికీ అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు వెన్నుదన్నుగా వుంటూ, అందరికీ ఆదర్శంగా నిలవాల్సిన తరుణమిదే. అందుకు త్వరలో ప్రధాని చైనా పర్యటన దోహదం చేస్తుందనవచ్చు.

అన్నిటికీ మించి, దాదాపు అన్ని దేశాల్లో, అనేక ప్రాంతాల్లో పొంచి వున్న ఉగ్రవాద ముప్పును అందరూ కలిసి సమిష్టిగా ఎదుర్కోవాల్సివుంది. ఉగ్రవాదంపై పోరుకు ఏవో కొన్ని దేశాలే కాదు, అన్ని దేశాలు సమిష్టిగా పోరు సాగించాల్సిన సమయం ఇదే. ఇప్పటికే పెనురక్కసిగా మారిన ఉగ్రవాదాన్ని సమూలంగా రూపుమాపేందుకు అన్ని దేశాలూ ఏకీభావంతో కంకణబద్ధులు కావాలి. అదే భారత్ ఆశయం కూడా. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించి, ప్రపంచశాంతికి ఊపిరిలూదిన నాడే.. మానవాళికి అసలైన మహోదయం. ఆ పవిత్ర కార్యాన్ని అందరి కర్తవ్యంగా మలుచుకోవాలి.

దేశమేదైనా, అందరమూ మానవులమేనన్న మానవతా పరిమళాలు జగమంతా వెల్లివిరియాలి. అందరూ కలిసి ప్రగతికి కొత్తదారులు తెరవాలి..జగతికి సరికొత్త వెలుగుదారులు పరవాలి. అందుకు.. ఇదే మంచి తరుణం కూడా.

---

# విజయ కేర్ ఉచిత వైద్యశిబిరం



ఈ నెల 1వ తేదీ నెల్లూరు, శ్రీనివాస అగ్రహారం హౌస్ ఓనర్స్ అసోసియేషన్, విజయకేర్ హాస్పిటల్ సహకారంతో నరాలు, కీళ్ళు, ఎముకలు, గుండెజబ్బులు, గైనకాలజీ విభాగాలకు చెందిన మెడికల్ క్యాంప్‌ను హాస్పిటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో డా॥ పి.విజయకుమార్, డా॥ జి.ఎల్. అన్నపూర్ణ, డా॥ ఎం.డి.అక్బర్‌ఖాన్ పాల్గొని 100మంది అసోసియేషన్ సభ్యులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.విజయకుమార్ పరిసరాల పరిశుభ్రత అవసరమని, గుండెవ్యాధుల సమస్యలు, జబ్బు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస అగ్రహారం హౌస్‌ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వి.సుబ్బారెడ్డి, కార్యదర్శి జి.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు జి.శ్రీనివాసులురెడ్డి, ట్రెజరర్ ఎం.చంద్రమౌళి, జాయింట్ సెక్రటరీ పి. రాఘవరెడ్డి, సభ్యులు భవాని, లోకేశ్వరరావు, రామయ్య కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### నిరీక్షణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# జన్మదిన వేడుకలు




నిరీక్షణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీ అరవ శాంత రాజు 42వ జన్మదినం వేడుకలను ఆయన కుటుంబ సభ్యులతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మాగుంట సుబ్బరామిరెడ్డి మానసిక వికలాంగుల పాఠశాల పిల్లల మధ్య జరుపుకోవడం జరిగింది. పిల్లలందరికీ పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డిస్ట్రిక్ట్ యన్.జి.ఓస్ ప్రెసిడెంట్ శేఖర్‌రావు, నిరీక్షణ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు భాగ్యరాజ్, శ్రీహరి, శ్రీధర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్. అజయ్‌బాబు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పునీత కానుకమాత నగరోత్సవం

నెల్లూరు కబాడిపాళెంలోని పునీత కానుకమాత నగరోత్సవం సోమవారం రాత్రి వైభవంగా సాగింది. కపాడిపాళెం నుండి ప్రధాన నగర వీధుల నుండి నగరోత్సవం సాగింది. భక్తులు వేలాదిగా పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరునగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ దయాగుణం కలిగిన పునీతమాతను ప్రజలకు ఎటువంటి కష్టనష్టాలు కలుగకుండా చూడాలని కోరినట్లు వివరించారు. పునీత కానుక మాత చర్చి ఫాదర్ నేవీకుమార్ ఆధ్వర్యంలో అనిల్‌కుమార్ మతపెద్దల ఆశీర్వాదాలు అందుకున్నారు.

---




# మత స్వేచ్ఛకు విపరీత అర్థాలు

భారత పర్యటనలో అమెరికా అధ్యక్షుడు ఒబామా మతస్వేచ్ఛను గురించి చేసిన వ్యాఖ్యలకు మన రాజకీయ నాయకులు విపరీతార్ధాలు తీస్తున్నారు. మతస్వేచ్ఛ అంటే ఒక వ్యక్తి తనంతట తానుగా ఇష్టపడి గుడికో, చర్చికో, మసీదుకో వెళ్లి తనకు నచ్చిన మతంలో చేరడం. అంతేగాని విదేశాల నుండి వచ్చే నిధులతో జనాలను ప్రలోభపెట్టి, తాయిలాలు చూపించి మతాలు మార్చడం కాదు. భారతదేశంలో మతం మార్పిడులలో నూటికి 90శాతం డబ్బు ప్రభావం వుంటుంది. దేవుడి మీద విశ్వాసంతో మతం మారేవాళ్లు చాలాతక్కువ మంది. భగవంతుడు లేడు అనుకునేవాళ్లకు మతంతో పనిలేదు. భగవంతుడు ఉన్నాడు అనుకునే వారికి కూడా మతంతో అవసరం లేదు. దేవుడు ఉన్నాడనే నమ్మకాన్ని మనసులో ఉంచుకుంటే చాలు. ఈ భూమ్మీద దేవుడి రూపాన్ని చూసిన వాళ్లెవరూ లేరు. ఎవరి ఇష్టం వచ్చిన రూపంలో వాళ్లు కొలుస్తున్నప్పుడు ఈ మతాల గొడవలెందుకు?

– పి.శ్రీవాత్సవశేఖర్, నెల్లూరు.

# డిప్యూటేషన్‌లు రద్దు చేయాలి

న్యాయశాఖలో అక్రమంగా కాంట్రాక్ట్ సిబ్బందికి డిప్యూటేషన్‌లు వేసే వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలి. డిప్యూటేషన్‌లు ఆరునెలలకు మించి వేయకూడదు. ఈ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోవడం లేదు. దీనిపై నెల్లూరు, తిరుపతి ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్‌లు కలుగజేసుకుని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, కేంద్ర న్యాయశాఖ మంత్రి సదానందగౌడ్‌కు లేఖలు వ్రాయాలి. జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లు, టైపిస్ట్‌లకు జీతాలు తక్కువ. పార్లమెంటు, అసెంబ్లీలో దీనిపై చర్చించాలి.

– జె.నిర్మల, వెంకటగిరి.

# ఏం మారలేదు

నేను మారిన మనిషిని అంటుంటే చంద్రబాబు నిజంగానే మారినట్లున్నాడని నమ్మి జనం ఓట్లేసారు. కాని మారింది ఆయన కాదు జనమే. ఆ అమాయకులు తమ మనసు మార్చుకున్నారు. చంద్రబాబును పూర్తిగా నమ్మారు. కాని చంద్రబాబు తన పాత విశ్వరూపమే మళ్ళీ బయటపెట్టాడు. సింగపూర్ లాంటి రాజధాని అంటూ పచ్చటి పంటపొలాలను నాశనం చేస్తూ వ్యవసాయం పట్ల తనకున్న ద్వేషాభావాన్ని బయటపెడుతున్నాడు. రాజధాని కట్టుకోవాలంటే రాష్ట్రంలో బీడుభూములే లేవన్నట్టు పచ్చటి పొలాలపై పడ్డాడు.

– టి.వి. రామకృష్ణారెడ్డి, మాచర్ల.



## ఆలయ కమిటీలకు రైట్... రైట్

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి 8నెలలు దాటినా ఇంతవరకు నామినేటెడ్ పదవుల జోలికి పోలేదు. పదేళ్ల నుండి ఒట్టిపోయిన గేదెల్లా అధికారం లేక అనుభవించడానికి పదవులు లేక వైరాగ్యంతో వున్న తెలుగు తమ్ముళ్లు ఇప్పుడు నామినేటెడ్ పదవుల కోసం ఆబగా ఎదురుచూస్తున్నారు. అయితే వీరిలో పదవులపై ఆసక్తి పెరిగేకొద్ది చంద్రబాబునాయుడు పదవుల భర్తీని వాయిదావేస్తూ వచ్చారు.

నెల్లూరుజిల్లాలో నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న తెలుగుతమ్ముళ్ల జాబితా భారీగానే వుంది. ఈ జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు పెద్దగా రాకపోవడంతో మొన్న ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు కూడా నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు.

కార్పొరేషన్‌లు, మార్కెట్ కమిటీలను పక్కన పెడితే ఈ నెలలోనే రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాలకు కమిటీలను నిర్ణయించనున్నట్లు తెలుస్తుంది. దీంతో జిల్లాలో ఆయా ప్రధాన దేవస్థానాల కమిటీ ఛైర్మెన్‌లు మరియు పాలక మండలి సభ్యులు పదవులను ఆశిస్తున్న వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.



జిల్లాలో నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం, మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం, జొన్నవాడలో కామాక్షమ్మ ఆలయం, నరసింహకొండలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, సూళ్లూరుపేటలో చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం, కొండబిట్రగుంటలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం పాలక కమిటీలకు డిమాండ్ వుంటుంది. ఇప్పటికే ఆయా దేవస్థానాలకు ఛైర్మెన్‌లు, సభ్యుల పేర్లను ఆయా నియోజకవర్గ అధికారపార్టీ ఎమ్మెల్యేలు, లేదా అధికారపార్టీ ఇన్‌ఛార్జులు తయారుచేసి పెట్టారు. పార్టీలో పాతోళ్లతో పాటు, కొత్తగా వచ్చినవాళ్లు ఈ పదవుల కోసం ప్రయత్నాలు జరుపుతున్నారు. ఆలయ కమిటీల భర్తీతో పసుపు తమ్ముళ్లలో రాజకీయ నిరుద్యోగ సమస్య కొంతవరకు తగ్గే అవకాశముంది.



# కౌన్సిల్‌కు 'యోగా' గ్రహణం





*నెల్లూరు నగరపాలక సంస్థ... గతంలో ఎంతో దరిద్రంగా వుందనుకునేవాళ్లు. నెల్లూరుకు ఏమీ చేయలేకపోతున్నారని గత పాలకులను తిట్టుకునేవాళ్లు. కాని గత పాలకులను మంచి వాళ్లనిపించేలా నేటి పాలకులు తయారయ్యారు. గతంలో కనీసం నగరంలో బ్లీచింగ్ చల్లడం, వీధులు ఊడ్చడం, ఫాగింగ్ చేయడం వంటి పనులన్నా జరిగేవి. గత పాలకుల హయాంలో అవినీతి జరిగినా అభివృద్ధి పనులు కూడా జరిగాయి. పనులు చేసి డబ్బులు సంపాదించుకున్నారు. గత పదేళ్లలో నెల్లూరులో కార్పొరేషన్ పరంగా కొత్త కార్పొరేషన్ భవనాన్ని కట్టడంతో పాటు సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీ, లింకురోడ్లు, పారిశుద్ధ్యం, మంచినీటి పైప్‌లైన్లు వంటి పనులెన్నో జరిగాయి. అయితే అప్పట్లో జరిగిన అభివృద్ధి పనులపై అవినీతి ఆరోపణలు కూడా బాగానే వచ్చాయి.*

కొత్త పాలకులు వస్తే అవినీతి లేని అభివృద్ధిని చూద్దామనుకున్న నెల్లూరు జనాల ఆశలు ఆవిరైపోతున్నాయి. ఇప్పుడు అభివృద్ధి లేదు... అసలు ఏ పనులూ జరగడం లేదు కాబట్టి అవినీతికి కూడా ఆస్కారం లేదు. గతంతో పోలిస్తే ఇప్పుడు అభివృద్ధి పనులు లేవు కాని ఇంకొన్ని మాత్రం అభివృద్ధి చెందాయి. అవేటంటే ముదురుదోమలు, బలిసిన పందులు, వీధికుక్కలు, కోతులు, చెత్తదిబ్బలు ప్రతి సందులోనూ కనిపిస్తున్నాయి.

నెల్లూరు నగరంలో సమస్యలకు కొదవలేదు. సిమెంటురోడ్లు, ఉద్యానవనాలు, అందమైన స్వాగత ద్వారాలు మాట దేముడెరుగు. నగరం నిండా దోమలు, పందులు విపరీతమయ్యాయి. డెంగ్యూ, స్వైన్‌ఫ్లూ వంటి రోగాల దెబ్బకు జనం ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ఉంటున్నారు. పందుల వల్ల స్వైన్‌ఫ్లూ వైరస్ సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. నగరంలో జనావాసాల మధ్యే పందులు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. పందులను జనావాసాలకు దూరంగా తరలించాలనే ప్రయత్నమే నగరపాలకుల్లో లేకుండా పోయింది. ఇక దోమల విజృంభణ అయితే చెప్పలేనంతగా వుంది. జనం రక్తాన్ని లీటర్ల లెక్కన తాగేస్తున్నాయి. దోమల దెబ్బకు నగర ప్రజలకు కంటి మీద కునుకు కరువవుతుంది. నగరపాలక సంస్థ దోమల నిర్మూలనకు కనీసం ఫాగింగ్, మురికి కాలువల్లో ఆయిల్‌బాల్స్ వదలడం వంటివి కూడా చేయడం లేదు.

నెల్లూరు నిండా సమస్యలు తిష్టేసి వున్నాయి. పాలకులు వర్గ రాజకీయాలతో ఈ సమస్యలు పట్టించుకోవడం లేదు. కనీసం ఈ సమస్యలపై చర్చించడానికి కౌన్సిల్ సమావేశాలు కూడా ఏర్పాటు చేయడం లేదు. చాలా తీరుబడిగా జనవరి 31వ తేదీ కౌన్సిల్ సమావేశం ప్రకటించారు. అయితే హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు రెండురోజుల పాటు ప్రజాప్రతినిధులకు, ఐఏఎస్ ఆఫీసర్లకు యోగా క్లాసులు పెట్టాడు. కౌన్సిల్ సమావేశం ఈరోజు కాకుంటే రేపు పెట్టుకోవచ్చు, మునిగిపోయేదేమీ లేదు, యోగా క్లాసులు అది కూడా చంద్రబాబు పాల్గొనే యోగా క్లాసులు మళ్ళీ మళ్ళీ పెట్టరుగా అనుకున్నారో ఏమో మేయర్ అజీజ్, కమిషనర్ చక్రధర్‌బాబులు కౌన్సిల్ సమావేశాన్ని వాయిదావేసి హైదరాబాద్ వెళ్లారు. నెల్లూరులో వున్న సమస్యలను గాలికొదిలి, నెల్లూరు జనాన్ని దోమలకు వదిలేసి మేయర్, కమిషనర్‌లు యోగా క్లాసులకు పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



# 'వాత్సల్య'.. వారికి అమ్మా.. నాన్నా.. అన్నీ!

*వారు అనాథలే అయినా..అద్భుత ప్రతిభకు వారు ప్రతీకలు. దురదృష్టవశాత్తూ తమకంటూ అమ్మా నాన్నా, అయినవారు ఎవరూ లేకపోయినా, ఎంతో మంది అనాథలైన చిన్నారులకు నెల్లూరులోని వాత్సల్య సంస్థే అమ్మా నాన్నా అన్నీ. అనాథబిడ్డలను అక్కున చేర్చుకుని, తమకు వారే కన్నబిడ్డలు అన్నట్లుగా వాత్సల్యపూరిత సేవలు అందిస్తోంది వాత్సల్య సంస్థ. విధి వక్రించి, తాము పుట్టగానే అమ్మానాన్నలు తమను ఏ రోడ్డుపైనో వదిలేసి వెళ్ళిపోతే, ఏ దిక్కూ లేక విలవిలలాడుతున్న ఆ చిన్నారులు వీధుల పాలు కాకుండా ఆ చిన్నారులకు అమ్మలా ఆశ్రయమిచ్చి ఆదరిస్తోంది వాత్సల్య సంస్థ. పసిబిడ్డల దశ నుంచి పెద్ద చదువులు చదువుకుని వృద్ధిలోకి వచ్చేదాకా ఆ అనాథ చిన్నారులను పెంచి పోషిస్తోంది. సమాజసేవా దృక్పథంతో, అకుంఠిత సేవాభావంతో ఇక్కడి నిర్వాహకులు, ఉపాధ్యాయులు అందరూ ఆ చిన్నారులు రేపటి భవితకు వెలుగుదీపాలు కావాలని మనసారా కోరుకుంటూ వారికి తమవంతు సేవలందిస్తున్నారు. మరెంతో మంది దాతలు మానవతాదృక్పథంతో, ఆ చిన్నారుల భవిష్యత్తుకు బంగరుబాటలు వేస్తూ వాత్సల్యకు తమవంతు సాయం అందిస్తున్నారు కూడా. వాత్సల్య సంస్థలో 1 నుంచి 10వ తరగతి లోపు చదువుకుంటున్న అనేకమంది చిన్నారులు పలు రంగాల్లో జిల్లా స్థాయిలోనే కాక, రాష్ట్ర స్థాయిలోనూ తమ ప్రతిభ చాటుతుండడం చూస్తే ఎంతో సంతోషం కలుగుతుంది.*

## అనాథలే అయినా.. అద్భుత ప్రతిభ



### ఖోఖోలో చందు ప్రతిభ :

జనహిత-వాత్సల్య సంస్థలోని భారతీయ విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 5వ చదువుకుంటున్న సిహెచ్ చందు అనే బాలుడు చదువులో ప్రథమశ్రేణిలో వుంటున్నాడు. అదే విధంగా, క్రీడల్లోనూ ముందంజలోనే వుండడం విశేషం. కబడ్డీ, ఖోఖో క్రీడల్లోనూ అద్భుతంగా రాణిస్తూ అనేక పోటీల్లో తన ప్రతిభను కనపరుస్తూనే వున్నాడు. జిల్లా స్థాయిలోనే కాక రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సైతం పాల్గొని తన ప్రతిభను చాటుకుంటున్నాడు. 2014 అక్టోబర్ 7వ తేదీన ప్రకాశం జిల్లా మైనంపాడులో జరిగిన 26వ ఆంధ్ర ఇంటర్‌డిస్ట్రిక్ట్ సబ్‌జూనియర్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లోనూ పాల్గొని తన ప్రతిభను నిరూపించుకున్నాడు.



### కబడ్డీలో సత్తా చాటుతున్న సురేష్:

వాత్సల్యలో 8వ తరగతి చదువుకుంటున్న కె.సురేష్ అనే బాలుడు కబడ్డీ క్రీడలో బాగా రాణిస్తున్నాడు. చదువులో ముందంజలో వుంటూనే, కబడ్డీలో జిల్లా స్థాయిలో రాణించి, 2014 అక్టోబర్‌లో అనంతపురం జిల్లాలోని అమరాపురం మండలం హాలుకూరులో ఏ.పి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన 60వ రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో కూడా పాల్గొని సత్తా చాటాడు.



### 'భగవద్గీత'లో సుష్మిత అద్భుత ప్రతిభ :

వాత్సల్య సంస్థలో చదువుకుంటున్న నిరుపేద చిన్నారులు కూడా ప్రతిభలో ఏమాత్రం పేదలు కాదు. చదువులో రాణిస్తూనే క్రీడలు, కళల పట్ల మక్కువచూపుతూ ఆయా రంగాల్లోనూ రాణిస్తున్నారు. అలాంటివారిలో, చిన్నారి సుస్మిత ఒకరు. ఈ చిన్నారి 1వ తరగతి చదువుకుంటోంది. భగవద్గీత శ్లోకాల పఠనంలో సుస్మిత ప్రతిభ అమోఘం. టిటిడి, విశ్వహిందూ పరిషత్ వారు నిర్వహించిన ఇల్లాస్థాయి పోటీల్లోనూ రాణించి అందరి ప్రశంసలూ అందుకుంది. భగవద్గీత శ్లోకాలను రాగయుక్తంగా పాడుతూ, శ్లోకాలను అనర్గళంగా చెప్తూ అందరి కరతాళధ్వనులందుకుంటూనే వుంది. ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లోనూ తన ప్రతిభను నిరూపించుకుంది. ఈ చిన్నారి యోగా, కరాటేలో కూడా ప్రావీణ్యం సంపాదిస్తోంది. బుడిబుడినడకలతో వచ్చి ఈ చిన్నారి భగవద్గీత శ్లోకాలు అనర్గళంగా చెప్తుంటే..ఎంతో ఆశ్చర్యం వేస్తుంది.



### కరాటేలో ఫస్ట్..శ్రీను :

వాత్సల్యలో 10వ తరగతి చదువుకుంటున్న సిహెచ్ శ్రీను అనే బాలుడు కరాటేలో తన ప్రతిభను చాటుకుంటున్నాడు. 2014లో డిసెంబర్ 21న నెల్లూరులో జరిగిన 3వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానాన్ని సాధించి వాత్సల్య పేరును మారుమ్రోగించాడు. చదువులోనూ ముందంజలో వుంటూ, సైన్స్‌ఫేర్ మోడల్స్ రూపొందించడంలోనూ మంచి ప్రతిభ చూపుతున్నాడు. ప్రత్యేకించి పిరమిడ్స్ వంటి ప్రయోగాత్మక మోడల్స్ తయారుచేసి సైన్స్‌ఫేర్‌లో వాటిని ప్రదర్శించి ఈ విద్యార్థి అందరి ప్రశంసలూ అందుకున్నాడు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీరాజ రాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న శ్రీ మీనాక్షి సుందరేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు స్తంభప్రతిష్టాపనతో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.కోదండ రామిరెడ్డి, ఆలయ ధర్మకర్త రత్నం జయరాం, ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, ప్రధాన అర్చకులు తంగిరాల రాధాకృష్ణ శర్మ పాల్గొన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు మహాశివరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఇఓ తెలిపారు. ఈ నెల 17వతేదీ మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని 14వ తేదీ సాయంత్రం 6గంటలకు అంకురార్పణ, 15న ధ్వజారోహణ, 16 నుండి 20వరకు స్వామివారికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## బాలకొండయ్య రిటర్న్

మాజీఐజి కె.బాలకొండయ్య మళ్ళీ బీజేపీలో చేరారు. డిఐజిగా రిటైర్డ్ అయ్యాక బాలకొండయ్య బీజేపీలో చేరారు. 1998 ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. 2014ఎన్నికలకు ముందు ఆయన వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. వైకాపా అధికారంలోకి రాకపోవడం, ఇప్పుడు దేశవ్యాప్తంగా బీజేపీ హవా నడుస్తుండడంతో ఆయన పాత పంచకే మళ్లీ వచ్చారు.

# నెల్లూరు కబుర్లు

## వెంకయ్య వస్తున్నాడు



కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు ఈ నెల 7, 8 తేదీలలో జిల్లాలో పర్యటించబోతున్నారు. 7వ తేదీ మధ్యాహ్నం 3.15గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్టులో దిగుతారు. అక్కడి నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి 3.30 గంటలకు కావలికి చేరుకుంటారు. అక్కడ ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ సభలో పాల్గొన్న అనంతరం కావలి విశ్వోదయ, జవహర్‌భారతి డిగ్రీ కాలేజీ డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. 5.25గంటలకు నెల్లూరు, చిల్డ్రన్స్‌పార్క్ వద్ద ఏర్పాటు చేసిన ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును ప్రారంభిస్తారు. 6గంటలకు కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగే జన్‌ధన్ యోజన కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి నెల్లూరులోని సొంత ఇంటిలో బస చేస్తారు. 8వ తేదీ ఉదయం 9.30గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఆత్మకూరుకు చేరుకుంటారు. నెల్లూరు పాలెం వద్ద ఏర్పాటు చేసిన తిరుపతినాయుడు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 11.30గంటలకు ఉదయగిరికి వెళ్ళి అక్కడ 100పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తారు. స్థానికులను కలిసి మాట్లాడి అక్కడనుండే ప్రకాశం జిల్లా పొదిలికి బయల్దేరి వెళతారు.


## ఉచిత స్వైన్‌ఫ్లూ మందులు



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మాగుంట సుబ్బరామిరెడ్డి స్పాస్టిక్స్ సెంటర్ నందు మానసిక వికలాంగ పిల్లలకు, పాఠశాల సిబ్బందికి స్వైన్‌ఫ్లూ సోకకుండా నివారించుటకు సదాశివ మెడికల్స్ అధినేత జి.రాజశేఖర్ నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేసి, మందులు ఎలా వాడాలో పిల్లలకు, పాఠశాల సిబ్బందికి వివరించారు.

ఈ కార్యక్రమంలో స్పాస్టిక్స్ సెంటర్ కమిటి సభ్యులు విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ జి.మాధురి, చిరంజీవి ఐబ్యాంక్ అధ్యక్షులు వి.వి.సుధీర్, అమెరికా నివాసి శ్రీధర్, పాఠశాల సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.15లక్షలు



నెల్లూరుజిల్లా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం అసోసియేషన్(నెపస్మా) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పురపాలకశాఖామాత్యులు పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో విశాఖ హుద్‌హుద్ తుఫాను సహాయనిధికి 15లక్షల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా నెపస్మా ప్రైవేట్ స్కూల్స్ అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తుఫాను బాధితులను ఆదుకునేందుకు జిల్లాలోని పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి రూ.32లక్షల రూపాయలు సేకరించామని, దానిలో 17లక్షల రూపాయలు విశాఖలో బాగా దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించి పి.నారాయణ, విద్యాశాఖామాత్యులు గంటా శ్రీనివాసరావు ద్వారా గతంలో సహాయం అందజేశామన్నారు. మిగతా 15లక్షల రూపాయలు ముఖ్యమంత్రికి హైదరాబాద్‌లో అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బాధితులను ఆదుకునేందుకు చేసిన సహాయానికి ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలను అభినందించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.వెంకట్రామయ్యనాయుడు, ట్రెజరర్ వై.మల్లిఖార్జునరెడ్డి, కరస్పాండెంట్స్ యు.వి.కృష్ణారెడ్డి, పి.వి.కృష్ణారావు, శంకరయ్య రాచాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాన్‌లో నిత్యానంద జయంతి



నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం నిత్యానంద బలరాముని జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు సుకదేవస్వామి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా, ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాద వితరణ గావించారు.

## ఏ.సి వాకర్స్ ఉచిత వైద్యశిబిరం



ఈ నెల 1వ తేదీ ఏ.సి.స్టేడియంలో ఉచిత బి.పి, బ్లడ్‌షుగర్ చెకప్ క్యాంప్ జరిగింది. ఈ ఉచిత మెడికల్ క్యాంపు ద్వారా 250మంది బి.పి, బ్లడ్‌షుగర్ చెకప్ చేయించుకున్నారు. ఏ.సి. స్టేడియం వాకర్స్ అసోసియేషన్ వారు తమ సొంత నిధులతో ఈ క్యాంపు నిర్వహించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మనిషి జీవన విధానం పూర్తిగా యాంత్రికమైందని, ఇంటి నుంచి బయట కాలుపెట్టగానే వాహనాల ద్వారానే తిరుగుతున్నారని, అందువల్ల మనిషికి సరైన శారీరక శ్రమ, సరైన వ్యాయామం లేక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ బి.శేషగిరిరావు, ట్రెజరర్ టి.నారాయణరావు పాల్గొని క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో డా॥ సత్యనాథ్, డా॥ అంకిరెడ్డి, డా॥ ఎం.ఎస్.రెడ్డి, డా॥ నాగేశ్వరరావు, డా॥ కృష్ణమూర్తి పాల్గొని వైద్యసేవలందించారు.

## సింహాచలంలో... బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ప్రమాణస్వీకారం



ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నూతన పాలకవర్గం ఈ నెల 1వ తేదీ విశాఖపట్టణం సింహాచలం క్షేత్రం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ప్రమాణస్వీకారం చేసింది. విశాఖపట్నం బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఏ.యస్.యన్.మూర్తి అధ్యక్షత వహించారు. సమాఖ్య గౌరవ సలహాదారు గుళ్ళపల్లి శివశర్మ శ్రౌతి కార్యవర్గసభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. బ్రాహ్మణజాతి సర్వతోముఖాభివృద్ధికి, ఐక్యతకు తీవ్ర కృషి చేస్తామని, ప్రభుత్వం ద్వారా రావలసిన అన్ని మౌలిక, ఆర్థిక సహాయాలు నిజంగా దారిద్ర్యరేఖకు క్రింద వున్న బ్రాహ్మణులకు అందేటట్లు పాటుపడతామన్నారు. అన్ని దేవాలయాల ట్రస్టుబోర్డులలో బ్రాహ్మణులకు అవకాశం కలిగే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు కృషి చేస్తామని సమాఖ్య అధ్యక్షులు కె.వి.బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బ్రాహ్మిన్ ఫెడరేషన్ రీజనల్ జనరల్ సెక్రటరీ వై.రామనరసింహం, నెల్లూరుజిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల అధ్యక్షుడు గుడ్లదొన వాసుదేవరావు, ఉపాధ్యక్షులు చిట్టమూరు శ్రీనివాసరావు, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, తుని, తణుకు, జంగారెడ్డిగూడెం, స్థానిక బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నెల్లూరుజిల్లా సంఘం నుండి స్వయంపాకుల శ్రీనివాసులు ఉపాధ్యక్షునిగా, చక్రాల వెంకటలక్ష్మీ నరసింహం కోశాధికారిగా, ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ కార్యవర్గసభ్యునిగా అధికార ప్రతినిధిగా ప్రమాణస్వీకారం చేశారు.

## గురువుకు అభినందనలు



శ్రీ కళాలయ కన్వీనర్, లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్ అవార్డు గ్రహీత, ప్రముఖ చిత్రకారుడు, హరనాథ్ ఆర్ట్ బేనర్‌పై దాదాపు 40సంవత్సరాలుగా నెల్లూరీయులకు చిత్రకారులుగా పరిచయస్తుడు సామంతుల హరనాథ్‌ను కళాకారునిగా గుర్తించి గణతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి చేతులమీదుగా ఉత్తమ కళాకారునిగా అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా శిష్యురాలు శ్రీ కళాలయ డైరెక్టర్ గూడూరు లక్ష్మి గురువుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## డ్వామా పీడీగా వెంకటసుబ్బయ్య

నెల్లూరుజిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పి.డిగా డిప్యూటీ కలెక్టర్ వెంకటసుబ్బయ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డ్వామా పీడీగా పనిచేస్తున్న గౌతమి తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈవోగా నియమితులయ్యారు. గౌతమి జిల్లాలో రెండున్నర సంవత్సరాల పాటు విధులు నిర్వహించారు.

## పెళ్లి పత్రికలా...? ఎన్నికల కరపత్రాలా?

ఈ నెల 24వ తేదీన నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుమార్తె పెళ్లి విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వుంది. సాధారణంగా రాజకీయ నాయకులు తమ ఇళ్లల్లో పెళ్లిళ్లు భారీ సెట్టింగ్‌లు వేసి, నానా ఆడంబరాలతో చేస్తుంటారు.

అయితే కోటంరెడ్డి వినూత్నశైలిలో హంగామా చేస్తున్నాడు. 2014ఎన్నికల్లో కూడా ఆయన తరపున ఇళ్లిళ్లు తిరిగి ఓట్లడగలేదు. కాని కుమార్తె పెళ్లికి మాత్రం శ్రీధర్‌రెడ్డి రూరల్ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి పెళ్లికార్డు పంపాడు. పెళ్లికి పిలవడానికి వెళ్లిన వాళ్లు ఇంట్లో వున్న యజమానుల పేరును కార్డుమీద వ్రాసి మరీ ఆహ్వానిస్తున్నారు. నెల్లూరుజిల్లాలో ఇంతవరకు పెద్ద కుటుంబాల పెళ్లిళ్లు చాలానే జరిగాయి. ఒక నియోజకవర్గంలో ఏ ఇంటినీ వదలకుండా ప్రతి ఇంటికి పెళ్లికార్డు ఇవ్వడం ఇప్పుడే జరిగింది.

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభిమానంతో పిలిచాడని చెప్పి రూరల్ నియోజకవర్గంలోని ప్రజలంతా వచ్చేస్తే విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ చాలదేమో!




నెల్లూరుజిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వమే సహకరించకపోయినా పరిస్థితులు మాత్రం సహకరిస్తున్నాయి.




# నెల్లూరు దారిలో వాహనాలు!

సీట్లు, ఓట్లు రాలేదని చంద్రబాబు సర్కార్ ఈ జిల్లాపై సవతితల్లి ప్రేమను చూపిస్తున్నా ప్రపంచ పారిశ్రామికవేత్తలంతా నెల్లూరుజిల్లా వైపు చూస్తున్నారు. నెల్లూరుజిల్లాకు పట్టింది తాత్కాలిక దరిద్రమే. కాని కొద్దికాలంలోనే పారిశ్రామికంగా నెల్లూరుజిల్లా పరుగును ఎవరూ ఆపలేరు.

సీమాంధ్రలోని 13జిల్లాల్లో పరిశ్రమలు నెలకొల్పడానికి అనువుగా ఉన్నది నెల్లూరుజిల్లానే కావడం గమనార్హం. ఏపిలో ఏ స్వదేశీ, విదేశీ కంపెనీల వాళ్లు తమ పరిశ్రమను పెట్టాలన్నా ముందుగా నెల్లూరుజిల్లా వైపే మొగ్గు చూపుతున్నారు. దీనికి కారణం లేకపోలేదు. నెల్లూరుకు కృష్ణపట్నం పోర్టు పెద్ద ఆయుధం. ఒకటిన్నర లక్షల టన్నుల సరుకులు తెచ్చే నౌకలు రాగల సామర్థ్యం ఒక్క కృష్ణపట్నం పోర్టుకే వుంది. ఇది ప్రైవేటు పోర్టు. అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తారు కాబట్టి వాణిజ్యానికి అనుకూలంగా వుంటుంది. సూళ్లూరుపేట వద్ద శ్రీసిటి పారిశ్రామిక సెజ్ విజయవంతమైంది. ఇప్పటికే 50కిపైగా దేశీయ, విదేశీ పరిశ్రమలు ఇక్కడ నెలకొల్పబడ్డాయి. తాజాగా దావోస్‌లో చంద్రబాబు ఒప్పందం కుదుర్చుకున్న పెప్సీ కంపెనీ కూడా తమ యూనిట్‌ను ఇక్కడ నెలకొల్పబోతుంది. చంద్రబాబు సీఎం అయ్యాక రాష్ట్రానికి మంజూరు చేయించిన మొదటి పరిశ్రమ 'హీరో' ద్విచక్ర వాహనాలు. దీనిని కూడా శ్రీసిటిలో నెలకొల్ప నున్నారు. ఇక టీవీఎస్ కంపెనీ కూడా తమ వాహన పరిశ్రమను కృష్ణపట్నం పోర్టు వద్ద ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇవికాకుండా జపాన్‌కు చెందిన మరికొన్ని పరిశ్రమలు కూడా కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటీ సెజ్‌లలోకి రానున్నాయి. నెల్లూరుజిల్లా వాళ్లు రాజధాని అని చెప్పి తుళ్లూరుకో, స్మార్ట్‌సిటీ అని చెప్పి వైజాగ్‌కో పరుగులు తీయబల్లేదు. ఏడాది తర్వాత నెల్లూరు జిల్లాను మించిన అభివృద్ధి ఇంకెక్కడా ఉండదు.

# ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

## - విహెచ్‌పి అఖిల భారత సహకార్యదర్శి కోటేశ్వరశర్మ



ధర్మాన్ని అందరూ పరిరక్షించుకోవాలని విహెచ్‌పి కేంద్రీయ కార్యాలయ ప్రముఖ్ (ఢిల్లీ), విహెచ్‌పి అఖిలభారత సహకార్యదర్శి కోటేశ్వరశర్మ అన్నారు. మతమార్పిడి పొందిన హిందువులను తిరిగి హిందూ మతంలోకి తీసుకురావడమే విహెచ్‌పి నిర్వహిస్తున్న 'ఘర్ వాపసి' కార్యక్రమం లక్ష్యమని అన్నారు.

విశ్వహిందూ పరిషత్ స్వర్ణ జయంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విహెచ్‌పి స్వర్ణజయంతి మహోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరులోని దర్గామిట్టలో వున్న శబరి శ్రీరామక్షేత్రం సమీపంలోని వేమాలశెట్టిబావి స్థలం ప్రాంగణంలో ఆదివారం పెద్దఎత్తున హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమానికి దువ్వూరు రాధాకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా, విహెచ్‌పి ప్రాంత సమన్వయ కార్యదర్శి మెంటా రామమోహన్‌రావు పర్యవేక్షించారు. పలువురు ప్రముఖులు, స్వామీజీలు పాల్గొని తమ సందేశాలనిచ్చారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరశర్మ మాట్లాడుతూ హైందవ చైతన్యమే భారత సంక్షేమమని అన్నారు. ధర్మపరిరక్షణ ధ్యేయంగా విహెచ్‌పి ఎంతోకాలంగా పనిచేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పరిరక్షించాలని, ఆ ధర్మమే మనలను రక్షిస్తుందని అన్నారు. గోరక్షణ కోసం ఎంతోమంది భజరంగదళ్ కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

విహెచ్‌పి పూర్వాంధ్ర ప్రాంత సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్ మాట్లాడుతూ, హిందూ ధర్మాన్ని, హిందూ సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ భగవంతుని ఎదుట అందరూ సమానులేనని, ఆలయాల్లో పూజారులు భక్తులపట్ల ఒకే విధంగా వ్యవహరించాలని సూచించారు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలతో పాటు పలు ఆశ్రమాలకు చెందిన స్వామీజీలు సుకదేవస్వామి (ఇస్కాన్), హనుమద్దాస్ స్వామీజీ (విజయవాడ), దయానందస్వామీజీ (దత్తాత్రేయమఠం), కృష్ణచైతన్యానందస్వామీజీ (మొగళ్ళూరు), సిద్ధేశ్వరస్వామీజీ (తాటిపర్తి), దుర్గాప్రసాద్‌స్వామీజీ, సరస్వతి విద్యానందస్వామీజీ, శ్రీహరితీర్థ స్వామీజీ, శ్రీ మార్కండేయానంద స్వామీజీలు పాల్గొని ప్రసంగించారు. ఆర్‌ఎస్‌ఎస్ నెల్లూరు ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ పుట్టా శేషు, వేళ్ళపాళెం రాజగోపాల్‌రెడ్డి, కె.జగన్మోహన్‌రావులతో పాటు ప్రముఖులు దేవరాల సంజీవయ్య, విళ్ళూరి మధుసూదన్, మిడతల రమేష్, శబరి శ్రీరామక్షేత్రం ఛైర్మెన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, హరికుమార్, మొగరాల సురేష్, దేగా మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విహెచ్‌పి పర్యవేక్షణలో ఆర్‌ఎస్‌ఎస్, భజరంగదళ్, దుర్గావాహిని తదితర హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో 13 హోమగుండాలతో శ్రీరామజపయజ్ఞం, లక్ష హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాలు ఎంతో ఘనంగా జరిగాయి. వేదికపై ఏర్పాటు చేసిన శ్రీ సీతారాములు, ఆంజనేయస్వామివార్లకు పూజలు నిర్వహించారు. ఘనంగా కూచిపూడి నృత్యం, భక్తిగీతాల కచ్చేరీ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో కార్యసాధక కేంద్రం

హైదరాబాద్‌లో ఇటీవల అసోసియేట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా, ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసిఏఐ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహింపబడిన 'సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల' రంగంపై నిర్వహింపబడిన సదస్సులో ఆ తరహా పరిశ్రమలు ప్రపంచ పోటీకి తట్టుకొని అభివృద్ధి చెందటానికి గాను ఒక కార్యసాధక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



పరిశ్రమల సమస్యలపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఐసిఏఐ అధ్యక్షులు డా॥ ఏ.యస్. దుర్గాప్రసాద్, అసోచం సంచాలకులు యు.కె.జోషి, అసోచం దక్షిణ భారత విభాగం అధ్యక్షులు, శ్రీసిటీ నిర్వాహక సంచాలకులు రవీంద్ర సన్నారెడ్డి అసోచం జాతీయ కార్యదర్శి డి.యస్.రావత్ సంయుక్తంగా విడుదల చేసిన ఒక ప్రత్యేక పుస్తకంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఎదుర్కొనే వివిధ సమస్యలకు పరిష్కారాలు, వృత్తి నైపుణ్యాన్ని పెంచడం, పరిశ్రమలు – విద్యాసంస్థల భాగస్వామ్యం, సంబంధిత విషయాలపై సదస్సులు – సమావేశాల నిర్వహణ వంటి వివిధ అంశాలపై కార్యసాధక కేంద్రం నిర్వహించాల్సిన బాధ్యతలను వివరంగా నిర్దేశించారు.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రాముఖ్యతపై మాట్లాడుతూ మన దేశ పారిశ్రామిక ఉత్పాదనలో 45శాతం, ఎగుమతులలో 40శాతం ఈ రంగం నుండే వస్తున్నదని, ఏటా 10లక్షల మందికి ఉపాధినిస్తూ, ఎనిమిది వేల రకాల ఉత్పత్తులతో, దేశ ఆర్థిక పురోగతికి ఈ రంగం అధికంగా తోడ్పడుతుందని రవీంద్ర సన్నారెడ్డి సోదాహరణంగా వివరించారు. ఆర్థిక, సాంకేతిక అంశాలు, నైపుణ్యాభివృద్ధి, ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, పరిష్కారాలు వంటి అనేక విషయాలపై అవగాహన చేసుకొనటానికి గాను ఒక వెబ్‌సైట్‌ను, అన్ని వేళల్లో సంప్రదించటానికి వీలుగా హెల్ప్ లైన్ ఫోన్ సౌకర్యం, ఒక మాస పత్రికను, వివిధ రంగాలలో పరిశోధనలను వివరించే పత్రికను, కార్యసాధక కేంద్రం నిర్వహిస్తుందని రవీంద్ర సన్నారెడ్డి వివరించారు.

# వ్యాధుల పట్ల అప్రమత్తం కండి

## --- జిల్లా కలెక్టర్ యం.జానకి ---



పరిసరాలతో పాటు చేతులను తరుచు సబ్బుతో శుభ్రం చేసుకుంటే స్వైన్‌ఫ్లూ వ్యాధి రాదనే విషయాన్ని ప్రజలకు అవగాహన కలిగించాలని జిల్లాకలెక్టర్ యం.జానకి అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో స్వైన్‌ఫ్లూ బారిన పడకుండా తీసుకొనవలసిన జాగ్రత్తల గురించి కలెక్టర్ వైద్యశాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఈ విషయంపై అవగాహన కలిగించాలన్నారు. జిల్లా వైద్యశాఖ స్వైన్‌ఫ్లూపై తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేయాలన్నారు.

జిల్లా వైద్యశాఖాధికారిణి డా॥ బి.భారతీరెడ్డి మాట్లాడుతూ స్వైన్‌ఫ్లూ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎపిడిమాలజిస్ట్ డా॥ వీరప్రతాప్, వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటి డెమో వి.శుభాపతి, సూపర్‌వైజర్, ఇ.శ్యామ్‌సన్‌లు పాల్గొన్నారు.

# స్వైన్‌ఫ్లూ మందులు పంపిణీ

నెల్లూరు నగరంలోని 53, 54డివిజన్ల పరిధిలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో స్వైన్‌ఫ్లూ నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి ఆంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ హోమియో మందుల వినియోగంతో స్వైన్‌ఫ్లూను నివారించవచ్చన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# నెల్లూరుజిల్లాకు భారీ అదృష్టం

## - జేసీ ఇంతియాజ్



నెల్లూరుజిల్లాకు రాబోయే రెండేళ్లలో భారీ పరిశ్రమలు రానున్నాయని, వచ్చేనెలలో క్రిబ్‌కో, కంటైనర్ పరిశ్రమలు ప్రారంభం కానున్నాయని జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ అన్నారు. మంగళవారం తన ఛాంబర్‌లో విలేకర్లతో జేసీ మాట్లాడుతూ క్రిబ్‌కో, కంటైనర్ల పరిశ్రమలకు వెంకటాచలం, టిపిగూడూరు మండలాల్లో భూములు కేటాయించామన్నారు. జిల్లాకు ఐటి పార్కు, ఫుడ్‌పార్క్‌లు, ఆటోమొబైల్ హబ్‌లు రానున్నాయని తెలిపారు. టివియస్, జివికె, రుచి ఆయిల్ పరిశ్రమలు ఏర్పాటు అవుతాయన్నారు. ఏర్పేడు–నాయుడుపేట మధ్య భారీ పరిశ్రమ ఏర్పాటు కానుందన్నారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములు గుర్తించమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. నెల్లూరుజిల్లాలో 1192 గ్రామాల్లో ప్రత్యేక సర్వేలు నిర్వహించినట్లు తెలిపారు. పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన 45వేల ఎకరాల ప్రభుత్వభూములు గుర్తించామన్నారు. జిల్లాలోని పొదలకూరు మండలం మరుపూరు వద్ద రాడార్ కేంద్రం ఏర్పాటుకు 72ఎకరాల భూములు కేటాయించామన్నారు. జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతను గుర్తించి వారికి బహుళజాతి కంపెనీల పరిశ్రమల్లో ఉపాధి కల్పించేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



ఈ నెల 1వ తేదీ తణుకులో దీక్షలో వున్న వైకాపా అధ్యక్షుడు వై.యస్. జగన్మోహన్‌రెడ్డిని కలిసి సంఘీభావం తెలుపుతున్న నెల్లూరునగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, జిల్లా వైకాపా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

# ఆకలికి...
# అలమటిస్తున్న సింహపురి ప్రయాణీకులు




మాజీ కేంద్రమంత్రివర్యులు పనబాక లక్ష్మి చొరవతో నెల్లూరుజిల్లా ప్రజల సౌకర్యార్థం గూడూరు – సికింద్రాబాద్ 'సింహపురి ఎక్స్‌ప్రెస్'ను ప్రారంభించారు. ప్రారంభ సమయంలో గూడూరు నుంచి రాత్రి 9గంటలకు బయలుదేరి ఉదయం 8గంటలకు సికింద్రాబాద్ చేరునట్లు షెడ్యూల్డు టైం ప్రకటించారు. కొన్ని రాజకీయ కారణాల చేత సదరు ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్‌లో రాత్రి 10.55 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9గంటలలోపు రావలసిన రైలు ఎప్పుడో ఒక్కరోజు తప్ప మిగిలిన రోజులలో సికింద్రాబాద్‌లో బయలు దేరే టైంకాని, గూడూరులో గమ్యం చేరే సమయం కాని, గంటలకొద్ది ఆలస్యమైనందువలన అందులో ప్రయాణం చేసే ప్రయాణీకులు, చిన్న పిల్లలు, వృద్ధులు, హార్టుపేషంట్లు, షుగర్ పేషంట్లు ఆకలికి అలమటిస్తున్నారు. దీనిని గమనించి రైల్వే అధికారులు స్పందించి రైలు ప్రారంభ టైంలో ఇచ్చిన షెడ్యూలు ప్రకారం గూడూరు నుండి రాత్రి 9గంటలకు బయలుదేరేటట్లు, అదేవిధంగా సికింద్రాబాద్‌లో 9.30గంటలకు బయలుదేరేటట్లు ఏర్పాటు చేసి సరైన టైంలో గమ్యం చేరేటట్లు చర్యలు తీసుకోవాలని సింహపురి ప్రజలు మరియు జిల్లా విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీసభ్యులు అరవ పార్వతయ్య ఒక ప్రకటనలో కోరారు. నెల్లూరుజిల్లాలో వున్న ఇద్దరు పార్లమెంటు సభ్యులు ఈ విషయంలో చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# చెవిరెడ్డిపల్లి గ్రామస్థులకు పట్టాలివ్వండి



ఆర్డీవో రవీందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరవ పార్వతయ్య

గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో రవీందర్ ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటగిరి మండలం, చెవిరెడ్డిపల్లి గ్రామస్థులు మాట్లాడుతూ సర్వేనెంబరు 105, 249, 250లలో ఉన్న దాదాపు 30ఎకరాల మెట్టభూమిని సాగు చేసుకొంటున్నామని వివరించారు. గ్రామంలో ఉన్న 50ఎకరాల భూమిని చిత్తూరుజిల్లా వాసులకు పట్టాలిచ్చారని, స్థానికంగా ఉన్న పేదలకు మాత్రం భూములు పంపిణీ చేయలేదని వాపోయారు. పరిశీలించి పట్టాలివ్వాలని జిల్లా విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటి సభ్యులు అరవ పార్వతయ్య ఆర్డీవోను కోరారు. తదుపరి పట్టణ సమీపాన వున్న గాంధీనగర్ ప్రాంతంలో నివాసముంటున్న పేదలకు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేసి, ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఇంకా డివిజన్‌లోని పలు మండలాలకు చెందిన సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.

# సమస్యలు పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ వెంకటనారాయణమ్మ

గ్రామాల్లో రైతులు వేసిన వివిధ పంటల వివరాలను సమగ్రంగా సర్వే జరిపి ఆధార్, బ్యాంక్ ఖాతా నెంబరును సేకరించాలని వీఆర్వోలకు తహశీల్దార్ సి.వెంకట నారాయణమ్మ సూచించారు. సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ వెంకట నారాయణమ్మకు విన్నవించారు.

## భక్తులతో కిటకిటలాడిన తాళమ్మ గుడి



గూడూరు పట్టణ విజయనగర్ కాలనీలో వెలసివున్న తాళమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సంక్రాంతి పండుగ తర్వాత అమ్మవారికి నెల పొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు సైదాపురం, చిల్లకూరు, మనుబోలు, నెల్లూరు ఇతర జిల్లాల నుంచి కూడా అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, శివకుమార్ రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆలయం ప్రాంగణంలో ఆలయ కమిటీ భారీ అన్నదానం నిర్వహించింది.

## శ్రీ సాయి నారాయణ మందిరంలో భక్తిగీతాలాపన పోటీలు

గూడూరు రెండవ పట్టణం జానకిరాంపేటలో వున్న శ్రీసాయి నారాయణ మందిరం నందు మందిర స్థాపకులు కీ॥శే॥ డాక్టర్ మేడా విజయలక్ష్మి ద్వితీయ వర్ధంతి సందర్భంగా మార్చి 4వ తేదీన నెల్లూరుజిల్లా స్థాయిలో 12సం॥ నుండి 18సం॥ వయస్సు కలిగిన యువతీయువకులకు సాయి భక్తి పాటలు, లలిత సంగీత పోటీలు నిర్వహించబడతాయని ప్రోగ్రామ్ కన్వీనర్ జి.శ్రీనివాసకుమార్ 'లాయర్'కు తెలిపారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.3,116/–, రూ.2,116/–, రూ.1,116/– మరియు 7ప్రోత్సాహక బహుమతులను రూ.501/– చొప్పున అందజేయడం జరుగుతుందన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమ వివరాలకు ఈ ప్రోగ్రామ్ కన్వీనర్ జి.శ్రీనివాసకుమార్, అర్గనైజర్, సింగర్ ఆలాపన ఫోన్. 9701567235, 7386231223లను సంప్రదించవలసినదిగా కోరారు.

## ఆధార్ నమోదుకు విశేష స్పందన

గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదుకు విశేష స్పందన కన్పించింది. డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన వారు తరలివచ్చి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దాదాపు 20కంప్యూటర్లను ఏర్పాటుచేసి ఆధార్ కార్డుల్లోని తప్పులను సవరించారు. కొత్తగా ఆధార్ నమోదు ప్రక్రియను కూడా చేపట్టారు. గతంలో వేలిముద్రలు, కనుపాపలు, తదితర వివరాల నమోదు కానివారికి ఈ ప్రత్యేక శిబిరం ఎంతగానో ఉపయోగపడింది. ఈ కార్యక్రమాలను గూడూరు ఆర్డీవో రవీందర్, గూడూరు, చిల్లకూరు తహశీల్దార్లు సి.వెంకటనారాయణమ్మ, శ్రీకాంత్ కేదార్‌నాథ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పర్యవేక్షించారు.



నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన 66వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకుంటున్న సబ్‌కలెక్టర్ కార్యాలయం గూడూరు డిప్యూటీ తహశీల్దార్ ఎలక్షన్స్ పి.గీతావాణి, కోట తహశీల్దార్ బాల లీలారాణి, గూడూరు ఆర్డీవో ఆఫీసు డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ వాణి, జూనియర్ అసిస్టెంట్ బి.రమ్యస్వాతి, ఆర్డీవో డ్రైవర్ వై.సుబ్బనాయుడు, జిల్లా అట్రాసిటి కమిటీ సభ్యులు అరవ పార్వతయ్య

## రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 06.02.2015 నుండి
తేది. 12.02.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, మకరంలో రవిబుధులు, కుంభంలో కుజశుక్రులు, సింహ కన్య తుల వృశ్చిక రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

**ముహూర్తము:**

తేది 11 బుధవారము ఉదయం గంట 10.03 నుండి గంట 11.40 లోగా మేష లగ్నమున వివాహ వ్యాపార గృహారంభములు.

**మాఘ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 06 | శుక్ర | విదియ | ఉ॥ గం.7.53వ॥ |
| తేది. 07 | శని | తదియ | ఉ॥గం.10.03వ॥ |
| తేది. 08 | ఆది | చతుర్థి | ప॥గం.12.03వ॥ |
| తేది. 09 | సోమ | పంచమి | ప॥గం.1.47వ॥ |
| తేది. 10 | మంగళ | షష్ఠి | సా॥గం.3.07వ॥ |
| తేది. 11 | బుధ | సప్తమి | సా॥గం.3.57వ॥ |
| తేది. 12 | గురు | అష్టమి | సా॥గం.4.15వ॥ |

### మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

చేపట్టిన పనులకు మొదట ఆటంకాలు ఎదురు కాగలవు. అందుచేత పనులు నిదానంగా జరుగుతాయి. ఆర్థిక విషయాల్లో మీ అంచనాలు ఫలించగలవు. వ్యాపారాలలో ఆటంకాలు తొలగి అభివృద్ధి కనిపించి ఆదాయం పెరుగుతుంది. పెట్టుబడులకు అవకాశాలు, షేర్లపై లాభాలుంటాయి. ఉద్యోగార్థులకు వచ్చిన అవకాశాలలో రాణిస్తారు.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు దొరుకుతాయి. సమావేశాలలో, కమిటి మీటింగులలో ప్రముఖంగా పాల్గొంటారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాల అనుమతులు లభిస్తాయి. క్రయవిక్రయాలలో తొందర పడవద్దు. ఆస్తి వ్యవహారాలు, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది.

### మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక వ్యవహారాలను చక్కగా నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. నిర్మాణాలకు అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. పెట్టుబడులు, షేర్లపై లాభా లుంటాయి. అనుకున్న కొన్ని ముఖ్యపనులు నిదానంగా జరగడం మనస్సుకు చికాకు కలిగిస్తుంది.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఖర్చులు పెరిగి ఆదాయ వ్యయాలలో తేడా ఉం టుంది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగానే ఉంటాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలలో క్రయాశీలంగా వ్యవహ రిస్తారు. పనుల వత్తిడి ఎక్కువగా ఉండటం వల్ల టెన్షన్ పడుతుంటారు. పెట్టుబడులు షేర్ల మీద లాభాలు నిరుత్సాహం కలిగిస్తాయి. క్రొత్త వ్యాపారాలు, భాగస్వామ్య పెట్టుబడులకు అవకాశాలుంటాయి.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థికపరమైన చిన్న ఇబ్బందులుంటాయి. ఉద్యో గులకు పనిభారం, శాస్త్ర సాంకేతిక రంగాల వారికి స్థాన మార్పులు, అదనపు బాధ్యతలుంటాయి. ఉపాధి పథకాలలో స్థిరపడతారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. అనుకొన్న పనులు జరుపుకొనడానికి శ్రమించవలసి ఉంటుంది. ఉద్యోగార్థులకు చిన్న అవకాశాలుంటాయి. విద్యావృద్ధి బాగుంటుంది.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకున్న పనులు సాధించుకొనే సమర్థత, సమస్యలను సర్దుబాటు చేసికొనగలిగిన ప్రతిభ బాగుంటుంది. అయితే అప్పుడప్పుడు టెన్షన్ ఉంటుంది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి, ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసి కొనండి. అవసరాలకు డబ్బు సర్దుబాటు కాగలదు. ప్రలోభాలకు దూరంగా ఉండండి.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు దొరుకుతాయి. అనుకున్న పనులను సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యవహారాలలో మాట చెల్లుబాటు కావడం, గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. కోర్టు కేసులందు అనుకూలత, నిర్మాణ రంగాల వారికి అనుమతులు, బ్యాంకు ఋణాలు లభిస్తాయి. షేర్ల మీద లాభాలుంటాయి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక ఇబ్బందుల నుండి బయట పడతారు. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు దొరికి ఆదాయం బాగుంటుంది. ముఖ్య నిర్ణయాలలో సలహాలు తీసి కొనడం మంచిది. కోర్టు కేసులు కొంత ఊరట కలిగిస్తాయి. రావలసిన బాకీలలో స్వల్ప రాబడి, విలువైన వస్తువులు కొనడం ఉంటుంది. స్థిరాస్తుల క్రయవిక్ర యాలకు అనువైన పరిస్థితులు ఏర్పడతాయి.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆదాయానికి తగ్గట్లు ఖర్చులు ఏర్పడినా ఆర్థిక ఇబ్బందులుండవు. రావలసిన బాకీలు, అనుకోని అదనపు ఆదాయం అందుతుంది. స్థిరాస్తులు, పెట్టుబడుల మీద లాభాలుంటాయి. కుటుంబసభ్యులతో గొడవలు లేకుండా సర్దుకొనిపోండి. సోదర వర్గానికి మేలు జరగడం, ముఖ్య బంధువులను కలుసుకొనడం జరుగుతుంది. షేర్లు లాభిస్తాయి. విద్యార్థులకు అభివృద్ధి ఉంటుంది.


### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, వ్యాపకం, ఆదాయం బాగుంటుంది. అనుకున్న పనులు, కార్యక్రమాలు యథావిధిగా సాగిపోతాయి. ఇతరుల విషయాలలో మీ చొరబాటు పనికిరాదు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. నిర్మాణాలు చేపట్టిన వారికి, కాంట్రాక్టులు నిర్వహించే వారికి అనుకూలసమయం. విద్యార్థులకు ప్రగతి బాగుంటుంది. శుభవార్త వింటారు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

తొందరపాటు నిర్ణయాలు తీసికొనే అవకాశం ఉన్నది. కాబట్టి జాగ్రత్తగా ఉండండి. కుటుంబసభ్యులతో కొంత అశాంతికి గురికాగలరు. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు చేజారిపోవచ్చు. ఆదాయము సామాన్యంగా ఉంటుంది. డీలర్లు, కాంట్రాక్టర్లకు ప్రభుత్వం పరంగా ఇబ్బందులుంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. దుబారా ఖర్చులు తప్పవు. కోర్టు కేసుల వల్ల ఆందోళన ఉంటుంది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఖర్చులు బాగా పెరుగుతాయి. వ్యాపార వర్గాలపై అధికారుల వత్తిడి ఉండవచ్చును. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు మీరు అమలులో పెట్టిన ఆచరణ వల్ల లభిస్తుంది. కొత్త ఉద్యోగావకాశాలు దొరకవచ్చు. షేర్ మార్కెట్ నిరుత్సాహపరుస్తుంది. అనుకున్న పనులు, కార్యక్రమాలు తొందరతొందరగా పూర్తి చేస్తారు. బిడ్డల విద్యా వివాహ ప్రయత్నాలు మంచి ఫలితాలనిస్తాయి.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి

**- టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర**

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి, ఆ పథకాలు సద్వినియోగం అయ్యేలా చూడాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో సోమవారం టిడిపి సంస్థాగత ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను అమలు చేయడంలో టిడిపి ఎంతో చిత్తశుద్ధితో కృషిచేస్తోందని ఆయన అన్నారు. ఈ పథకాల అమలుకు అందరూ సహక రించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి. గంగరాజు మాట్లాడుతూ త్వరలోనే డ్వాక్రా, చేనేత రుణాలను కూడా మాఫీ చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.షణ్ముగం, కోవూరు-ఆత్మకూరు నియోజకవర్గాల ఇన్‌ఛార్జి ఎం.హనుమంతరావు, కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళపాక అనూరాధ, సీనియర్ నాయకుడు బెజవాడ ఓబులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వైన్‌ఫ్లూ సోకకుండా జాగ్రత్తలు

స్వైన్‌ఫ్లూ వ్యాధి సోకకుండా ముందుజాగ్రత్తగా మందులు పంపిణీ చేస్తున్నట్లు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళపాక అనూరాధ తెలిపారు. నెల్లూరులోని ఉడ్‌హౌస్ సంఘంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో, స్వైన్‌ఫ్లూ నివారణకు సోమవారం హోమియో మాత్రల పంపిణీ జరిగింది.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌లో స్వైన్‌ఫ్లూ వ్యాధి తీవ్రత ఎక్కువగా వుందన్న సమాచారం నేపథ్యంలో, జిల్లాలో ఆ వ్యాధి రాకుండా ముందుజాగ్రత్తగా మందులు పంపిణీచేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో స్వైన్‌ఫ్లూ నివారణ మాత్రలను పంపిణీ చేయాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గంగాధర్, బాబు, శివ, పెద్దబాబు, రమేష్, వెంకటేశ్వర్లు, నందు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, నవాబుపేట పత్తివారి స్కూల్‌లోనూ తెలుగు యువత నగర అధ్యక్షుడు బ్రహ్మయ్యనాయుడు, బాలాజీ ఆధ్వర్యంలో స్వైన్‌ఫ్లూ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉచ్చి భువనేశ్వరప్రసాద్ పాల్గొన్నారు. ప్రముఖ వైద్యులు శ్రీనివాస్‌కుమార్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కాగా, స్థానిక సేవామార్గం సొసైటీ వారి ఆధ్వర్యంలో, నగర శివారుల్లో వున్న బోడిగాడితోట ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు స్వైన్‌ఫ్లూ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డాక్టర్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ విమర్శలు అర్థరహితం





- సోమిరెడ్డి ధ్వజం

నవ్యాంధ్ర అభివృద్ధి, కొత్తరాజధాని నిర్మాణం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తుంటే జగన్ వాటన్నింటినీ పట్టించుకోక చంద్రబాబు ముఖ్యమంత్రిగా విఫల మయ్యారని విమర్శలు చేయడం, దీక్షలు చేయడం అర్థరహితమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆది వారం తెలుగుదేశంపార్టీ నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో చంద్రన్న వెలుగు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో సోమిరెడ్డితో పాటు నెల్లూరు పార్ల మెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బీద రవిచంద్ర, రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాళ్లపాక అనూరాధ, నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, వమిడి రవికుమార్ చౌదరి, కిలారి వెంకట స్వామి నాయుడు, నూనె మల్లిఖార్జునయాదవ్, మండవ రామయ్య, వై.వి.సుబ్బారావు, పడ వల కృష్ణమూర్తి, స్వర్ణ వెంకయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ఏ అధికారం లేకుండా తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టు కుని లక్ష కోట్ల రూపాయలు దోచుకు తిన్నది అరక్క జగన్ దీక్షలు చేస్తున్నారని దుయ్య బట్టారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లా డుతూ జగన్‌ను సొంత పార్టీ నాయకులే నమ్మే పరిస్థితి లేదన్నారని, మరో ఆరు నెలల్లో ఆ పార్టీ మూసేయడం ఖాయమ న్నారు. బీద రవిచంద్ర మాట్లాడుతూ వైకాపా ఎమ్మెల్యేలు పార్టీ నుంచి వీడిపోతు న్నారని జగన్ దీక్షలకు దిగుతున్నారని, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేయవద్ద న్నారు. ఈ కార్యక్రమంలో టి.రమేష్‌రెడ్డి, జడ్.శివప్రసాద్, ఆనం జయకుమార్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

## రత్నం విద్యార్థుల ప్రతిభ

బెంగుళూరులోని గ్లోబల్ ఒలంపియాడ్ వారు నిర్వహించిన సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ ఒలంపియాడ్ పరీక్షల్లో లక్ష్మీపురంలోని రత్నం హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ చూపారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్‌లో ఎం.ప్రీతమ్, ఎస్.మనోజ్‌కుమార్, వి.శ్రీవిద్య, ఎ.కార్తీక్‌లు, మ్యాథ్స్‌లో ఎం.భవిష్య, ఇంగ్లీష్‌లో జి.దివ్యశ్రీలు పతకాలు సాధించినట్లు ఆయన వెల్లడించారు. అలాగే భారతీయ సంస్కృతి పోటీ పరీక్షల్లో ఎం.వినిత్‌సాయి జిల్లా స్థాయిలో మూడో స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. ప్రతిభారత్నాలను పాఠశాల డైరెక్టర్ రమావేణుగోపాల్ అభినందించారు.


**In the court of the Ist Addl. Senior Civil Judge: Nellore**

I.A.No. 258/2014
O.S.No.300/2014

Syed Rehana Begum
Vs - Petitioner/Plaintiff
Syed Khadarunnisa and Others - Respondents/Defendants

**Notice to Ist Respondent**

Syed Khadarunnisa
W/o Syed Abdul Rahiman
Door No.21/393, JandaStreet,
Nellore City

పై నంబరువ పిటిషనరు/వాది పైకోర్టులో ఆర్డరు 39రూల్ 1 & 2 సిపిసి ప్రకారము మీపై ఇంజక్షన్ పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తే.12.02.2015దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదారోజు ఉదయం 10.30గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

జి.సుబ్బలక్ష్మి, B.A., B.L.,
పిటిషనరు/వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

**In the court of the Ist Addl. Senior Civil Judge: Nellore**

O.S.No. 300/2014

Syed Rehana Begum - Plaintiff
Vs
Syed Khadarunnisa and Others - Defendants

**Notice to Ist Defendant**

Syed Khadarunnisa
W/o Syed Abdul Rahiman
Door No.21/393, JandaStreet,
Nellore City

మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం తే.12.02.2015దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదారోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ పై వకీలుద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

జి.సుబ్బలక్ష్మి, B.A., B.L.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

# కల్యాణ వైభవం...!



శేఖరమంత్రి రామమోహన్‌రెడ్డి - సుజనిల కుమారుడు మణితేజా రెడ్డి - నవ్య (కలికి సుధాకర్‌రెడ్డి - శ్రీలతల కుమార్తె)ల కల్యాణం జనవరి 29వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కల్యాణ మండపం నందు ఘనంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



ప్రముఖ షుగర్‌వ్యాధి వైద్యనిపుణులు డా॥ యస్.సత్యనారాయణమూర్తి - జయలక్ష్మిల కుమార్తె డా॥ స్వేత - డా॥ సి.ప్రేమ్‌దీప్ (శ్రీకాళహస్తి వాస్తవ్యులు శివకుమార్ - ఉషారాణిల కుమారుడు)ల వివాహం జనవరి 25వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కల్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' దీవెనెలు.

# మహాపండితుడు 'పంచాగ్నుల'



ప్రసంగిస్తున్న వెన్నెలకంటి

చిరునవ్వుతో కనిపిస్తూ, పలకరిస్తూ చక్కనైన కవిత్వాన్ని అందించిన మహా పండితుడు పంచా గ్నుల విశ్వేశ్వరశర్మ అని ప్రముఖ సినీ రచయిత వెన్నెలకంటి కొనియాడారు. బుధ వారం నెల్లూరు టౌన్ హాలులో వర్ధమాన సమాజంలో 25 కళా సంఘాలు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా పంచాగ్నుల సంతాపసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న మాజీఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ ప్రజాభిమానం పొందుతూ, సాహిత్యంలోనూ, వివిధ కళల్లోనూ సింహపురి కీర్తిని చాటిన పండితుడు పంచాగ్నుల విశ్వేశ్వరశర్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలు కూల్చివేత

నెల్లూరు నగరంలో అక్రమ నిర్మాణాలపై నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. నియమనిబంధనలు పాటించని భవనాలు గుర్తించి వాటిని తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల నెల్లూరు ఆచారివీధిలో అక్రమంగా నిర్మిస్తున్న భవంతిని పరిశీలించారు. జీ-4 అనుమతితో కమర్షియల్ కాంప్లెక్సులు నిర్మిస్తున్నట్లు తెలుసుకొని అధికారులు కట్టడాన్ని కూల్చివేశారు. ఈ దాడుల్లో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పి.చంద్రమౌళేశ్వరరెడ్డి, నగర ప్రణాళిక అధికారి శ్రీనివాసులు, సహాయప్రణాళిక అధికారి వరప్రసాద్, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# వివాహబంధం మరుపురానిది



మానవ జీవితంలో వివాహబంధం మరుపురానిదని, జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడానికి వివాహపరిచయ వేదికలు ఉపయోగపడతాయని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటి కమిషనర్ ఏనుగుల చైతన్య మురళీ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు నగరం టౌన్‌హాలులో ఉచిత మెగా బలిజ, కాపు, తెలగ వివాహ పరిచయవేదిక జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. విద్యుత్ శాఖ డిఇఇ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఆరునెలలకోసారి ఈ వివాహ పరిచయవేదికలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ వేదికలో ప్రకాశం, చిత్తూరు, కడప, విశాఖపట్నం, హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు ప్రాంతాల నుంచి వచ్చి 308మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. తొలుత శ్రీకృష్ణ దేవరాయల జన్మదిన మాసోత్సవాలు సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ సుధాకర్, విశ్రాంత డిపిఆర్ఓ ఎం.వెంకటరత్నం, మధుసూదనరావు, లక్కాకుల పెంచలయ్య, గార్లపాటి సుబ్బారావు, ఆనాల వెంకటరావు, సానా సుబ్రహ్మణ్యం, లోకేశ్వరరావు, పరిచయవేదిక వ్యవస్థాపకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# కొండంత వ్యతిరేకత?

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయాలు ప్రజలకు ఏ మాత్రం రుచించడం లేదు. గద్దెనెక్కిన ఎనిమిది నెలల్లోనే తెలుగుదేశం ప్రభుత్వంపై ప్రజల్లో నిరసన వ్యక్తమవుతుంది. ప్రభుత్వ పనితీరులో వేగం లేకపోవడమే కాక పాలనాపరమైన నిర్ణయాలు ప్రజలపై భారం మోపే విధంగా ఉంటున్నాయి. అంతేగాక గత ఎన్నికల్లో చంద్రబాబు ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేసే పరిస్థితి లేకపోవడం ప్రజావ్యతిరేకతకు కారణమవుతుంది.

2014 ఎన్నికల్లో చంద్రబాబు జీవన్మరణ సమస్యగా పోరాడాడు. జగన్ ఆత్మవిశ్వాసంతో కాకుండా అతివిశ్వాసంతో ఎన్నికలకు వెళ్లాడు. అక్కడే తేడా కొట్టింది. జగన్ ప్రతిపక్ష పాత్రకు పరిమితమైతే చంద్రబాబు అధికారపీఠమెక్క గలిగాడు. ఆ ఎన్నికల్లో అధికారం కోసం చంద్రబాబు చేసిన అతిపెద్ద సాహసం రాష్ట్రంలో రైతులు, డ్వాక్రా మహిళలకు సంబంధించిన 83వేల కోట్లు రుణమాఫీ చేస్తాననడం. విభజన మూలంగా రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని ఆయనకు తెలుసు. ఒకేసారి ఋణమాఫీ అసాధ్యమని కూడా తెలుసు. అయినా ముందు ఓట్లు రావాలని రైతుల బలహీనత మీద దెబ్బకొట్టాడు. చంద్రబాబు హామీని నమ్మి రైతులు, మహిళలు ఓట్లేసారు.

ఇప్పుడు ఋణమాఫీ ఏ రీతిలో ఏడుస్తుందో చూస్తున్నాం. ఋణమాఫీ జాబితా నుండి మహిళలు ఎగిరిపోయారు. బంగారు ఋణాలు ఎగిరాయి. బ్యాంకుల్లో పూర్తిగా ఋణం మాఫీ కాకపోవడంతో రైతులకు కొత్తగా అప్పులు పుట్టడం లేదు. రైతులు పండించిన ధాన్యానికి వచ్చిన చెక్కులను తీసుకుని రైతులు బ్యాంకులకు వెళితే బ్యాంకు అధికారులు వాటిని రైతుల అప్పుక్రింద జమేసుకుంటున్నారు. ఋణమాఫీ విషయంలో ఆయన కొంతవరకు పనిచేసినా సార్ధకత లేకుండా పోయింది. అలాగే డ్వాక్రా మహిళా ఋణాల విషయంలోనూ చంద్రబాబు మాట తప్పాడు. డ్వాక్రా ఋణమాఫీపై పూర్తిగా చేతులెత్తేసినట్లే! దీని మీద మహిళలు కూడా మండిపడుతున్నారు.

సీఎం కాగానే చంద్రబాబు అన్ని జిల్లాలలో పరిస్థితులు, సమస్యలపై దృష్టిపెట్టలేదు. గుంటూరు జిల్లాలో కృష్ణానది ఒడ్డున సింగపూర్ లాంటి రాజధాని కట్టడమే జీవిత లక్ష్యంగా పెట్టుకున్నాడు. సింగపూర్ వంటి అందమైన రాజధాని వల్ల రాష్ట్ర ప్రజలకు ఇప్పటికిప్పుడు ఒరిగేదేమీ లేదు. సామాన్య ప్రజలకు రాజధానితో అంత ఎమర్జెన్సీ పనులు కూడా ఏమీ లేవు. రాజధాని కట్టుకోండంటూ కేంద్రం ఇప్పటికిప్పుడు వందలు, వేలకోట్లు రాష్ట్రానికిచ్చే పరిస్థితి లేదు. సింగపూర్ రాజధాని మాస్టార్ ప్లాన్‌లు అంటూ కోట్ల రూపాయలు తగలేస్తున్నారు. రాజధాని పేరుతో మూడు పంటలు పండే భూములను నిర్వీర్యం చేస్తుండడం కూడా ప్రజలు, రైతులలో వ్యతిరేకతను పెంచుతుంది. ఈమధ్య సంక్రాంతి పండుగకు ప్రజలను ఆకర్షించడానికి 'చంద్రన్న కానుక' అంటూ శెనగలు, బెల్లం, నెయ్యి ప్యాకెట్లు ఇచ్చారు. దీనివల్ల ప్రజలు సంతృప్తి చెందిందేమీ లేదు. కాని కరువుకాలంలో ఖజానాకు 300కోట్లకు పైగా బొక్క.

చంద్రబాబు మీదే కాదు జిల్లాల వారీగా ఆయన మంత్రివర్గ సహచరుల మీద కూడా ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. ఏ మంత్రి కూడా సొంత జిల్లాలలో పనులు చేస్తున్న దాఖలాలు లేవు. తాజాగా ఉద్యోగులలోనూ అసంతృప్తి రేగింది. స్వతహాగా ఉద్యోగులు చంద్రబాబుకు వ్యతిరేకంగా ఉంటారు. విభజన నేపథ్యంలో చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం ఆర్థికంగా కోలుకోవడానికి ఆయన అనుభవం పనికొస్తుందనే ఆశతో వాళ్లు ఓట్లేసారు. ఇప్పుడు వాళ్లకు కూడా జీతాలిచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

అంతెందుకు తెలుగుదేశం కార్యకర్తలలోనే తీవ్ర అసంతృప్తి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ పార్టీ కార్యకర్తలు జల్సాగా పనిచేసుకున్నారు. ఇప్పుడు తెలుగుదేశంలో చాలావరకు కాంగ్రెస్‌పార్టీ మిక్స్ అయ్యింది. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి వున్న కార్యకర్తలు అన్యాయానికి గురవుతున్నారు. మా పార్టీకంటే కాంగ్రెస్ అధికారంలో వున్నప్పుడే బాగుందనే ఫీలింగ్ వారిలోనూ కలుగుతోంది. మొత్తానికి చాలా తక్కువ కాలంలోనే చంద్రబాబు సర్కార్‌పై ప్రజాగ్రహం వెల్లువెత్తుతుండడం గమనార్హం.

## ఉదయగిరి వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మెన్‌గా చంద్రా



నెల్లూరు జిల్లా ఉదయ గిరి వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మెన్‌గా వరికుంటపాడు మండల తెలుగు దేశం పార్టీ కన్వీనర్ చంద్రా మధుసూదన్ రావును ప్రభుత్వం బుధవారం నియమించింది.

# 'దేశం'లో ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

అదే జరిగితే చంద్రబాబు ఈ దేశమే వదిలివెళ్లి శాశ్వతంగా సింగపూర్‌లో ఉండొచ్చు. ఎందుకంటే రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని ఈ తరం ప్రజలు అప్పుడే మరచిపోలేదు. తెలుగుదేశం అభ్యర్థిగా దివంగత వెంకటరమణ సతీమణి రంగంలో వుంది. అధికారపార్టీ హంగు ఆర్భాటంతో పాటు, సానుభూతి, కులబలం కలిసొస్తుంది. కాబట్టి భారీ మెజార్టీతో ఆమె గెలవాలి. కాంగ్రెస్‌కు డిపాజిట్ కూడా రాకూడదు.

అయితే, తిరుపతిలో పరిస్థితిని వూహించలేకపోతున్నారు. కాంగ్రెస్ గెలుపు వూహించడం లేదుగాని ప్రజల్లో చంద్రబాబు మీదున్న వ్యతిరేకత ఈ ఎన్నికలపై పడుతుందేమోనని తెలుగుదేశం నాయకులు భయపడుతున్నారు. తెలుగుదేశం మీద వ్యతిరేకత కొద్ది ఆ పార్టీ అభ్యర్థికి మెజార్టీ తగ్గి కాంగ్రెస్ ఒక మోస్తరుగా ఓట్లు రాబట్టినా తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల్లో పరపతి కోల్పోయినట్లే!

# జగన్ అడుగులు ఎటువైపు?

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన అధికారాన్ని చేజేతులా కాజేసుకున్నామనే బాధ పార్టీలో అందరిలోనూ వుంది. ఎన్నికల తర్వాత పార్టీ కేడర్ కొంతవరకు చెదిరిపోయింది. మిగిలిన కేడర్ అనిశ్చిత పరిస్థితిలో వుంది. దీనికి కారణం జగన్‌పై వస్తున్న పుకార్లే! జగన్ జైలుకుపోతాడని, పార్టీని మూతేస్తారని, లేదంటే బీజేపీలో కలిపేస్తారని రకరకాల వూహాగానాలు వెలువడుతున్నాయి. ఈ ప్రచారం వల్లే వైకాపాలో వుంటున్న చాలామంది నాయకులు అప్పుడే పక్కచూపులు చూస్తున్నారు. పార్టీ కేడర్‌కు జగన్ ముందుగా తనపై నమ్మకం కల్పించాలి. పార్టీని నిలుపుతామని, ఏ పార్టీలోనూ కలపబోమనే భరోసా ఇవ్వాలి. కేడర్‌కు ధైర్యం కల్పించాలి. బూత్ స్థాయి, గ్రామస్థాయి, మండల స్థాయిలలో కేడర్‌ను పటిష్టం చేసి ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలకు అక్కడే పునాదులు వేయాలి. అటువంటి పునాదులు పడితేనే వైకాపా పటిష్టమవుతుంది.

శ్రీను గల్పిక

# ఒబామాకు నెల్లూరు బ్లడ్‌డెవిల్స్ ఫోర్స్ భద్రత 2

**జరిగిన కథ: భారత దేశ 66వ గణతంత్ర వేడుకలలో పాల్గొనేందుకు అమెరికా అధ్యక్షుడు ఒబామా సతీసమేతంగా వచ్చాడు. పాలెం ఎయిర్ పోర్టులో ప్రధాని నరేంద్రమోడీ ఒబామా దంపతులకు స్వాగతం పలుకుతారు. తన కాన్వాయ్‌లో గాని, తాను బస చేసిన ఐటిసి హోటల్ వద్ద కాని ఒక్క పోలీసును కూడా సెక్యూరిటీగా పెట్టకపోవడం చూసి ఒబామా ఆందోళన చెందుతాడు. 25వ తేదీ రాత్రి ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన విందుకు ఒబామా హాజరవుతారు. అక్కడ కూడా తనకు సెక్యూరిటీగా ఒక్క పోలీసు కూడా లేకపోవడాన్ని గమనించిన ఒబామా అదే విషయాన్ని మోడీతో ప్రస్తావిస్తాడు. ఒబామా ఆందోళన చూసి మోడీ నవ్వుతాడు.**

ఆ తర్వాత...

ఒబామాజీ, మీరు మాకు అత్యంత విలువైన అతిథి. ఇక్కడ దేశాల మధ్యే కాదు, వ్యక్తుల మధ్య కూడా సంబంధాలు బలంగా ఉండాలని కోరుకుంటున్నాం. మీ ఈ పర్యటనను మేము ఆత్మీయపూర్వకంగా చూస్తున్నాం. మీ భద్రతకు లోటు రానిస్తామా? ప్రపంచంలోనే ఇంతవరకు ఏ దేశాధినేతకు లేనటువంటి అసాధారణ భద్రతను మీకు కల్పించాము. ఉగ్రవాదులు కాదు కదా, రాజమౌళి ఈగలు కూడా మీవైపు కన్నెత్తి చూడలేవు. మేం మీకు కల్పించిన భద్రత ఎటువంటిదనేది ఇప్పటికిప్పుడు కంటికి కనిపించేది కాదులేండి... మీకొచ్చిన భయమేమీ లేదు. రాత్రికి నెత్తి మీద తడిగుడ్డ వేసుకుని హాయిగా నిద్రపోండని చెప్పాడు. మోడీ ధైర్యవచనాలతో ఒబామాలో ఆందోళన తొలగిపోయింది. మనసు ప్రశాంతం కావడంతో అప్పుడు అందరితో కలివిడిగా మాట్లాడాడు. ఇండియన్, చైనీస్ వంటకాలతో పాటు నెల్లూరు చేపలపులుసుతో అన్నం కలుపుకుని తిని బ్రేవ్‌మని తేన్చాడు. అక్కడున్న అందరికీ గుడ్‌నైట్ చెప్పి తిరిగి ఐటిసి హోటల్‌కు చేరుకున్నాడు. తన గదిలోకి వెళ్లి సూటూబూటూ విప్పేసి నైట్‌డ్రస్ వేసుకుని అక్కడేవున్న ఒక టవల్‌ను నీళ్లలో ముంచి తరువాత నెత్తిమీద పెట్టుకుని బెడ్‌మీద పడుకున్నాడు. అది చూసి మిషెల్... అదేంటండీ తడిగుడ్డ నెత్తిమీద పెట్టుకున్నారని అడిగింది. అందుకు ఒబామా... డిన్నర్‌లో మోడీ చెప్పగా వినలేదా... తడిగుడ్డ నెత్తి నేసుకుని నిద్రపొమ్మన్నాడుగా... ఈ ఇండియన్స్ ఏదీ ఊరికే చెప్పరు... వాళ్లు ఏది చెప్పినా దాంట్లో ఏదో ఒక మర్మం ఉంటుంది. బహుశా తడిగుడ్డ నెత్తిన పెట్టుకుని నిద్రపోతే, మెదడు చల్లబడుతుందను కుంటాను అని అన్నాడు. మిషెల్ చిరాగ్గా... అలాగయితే ఆ టవల్‌ను ఏరియల్ పౌడర్ వేసిన వాటర్‌లో ముంచి నెత్తిన పెట్టుకోండి... బ్రెయిన్ క్లీన్‌గా కూడా అవుతుందని చెప్పింది. ఇండియన్స్ చిట్కాలు నీకు కూడా బాగా వంటబట్టాయే అని ఒబామా మిషెల్‌ని ప్రశంసించాడు. ఇక చాల్లే... పడుకోండి అంటూ మిషెల్ ముసుగుతన్ని పడుకుంది. తడిగుడ్డ తలకు తగలడంతో ఒబామాకు బాగా నిద్రపట్టేసింది. సరిగ్గా అర్థరాత్రి ఒంటిగంట సమయంలో 'జుయ్‌య్‌య్...' మంటూ విమానాలు పోతున్న శబ్దం రావడంతో ఒబామా ఉలిక్కిపడి లేచాడు. కిటికీ తీసి బయటకు చూసాడు. కిటికీ పక్కనే జుయ్‌య్... మంటూ శబ్దం. కాని విమానాలేవీ లేవు. ఒబామాకు కొంచెం భయమేసింది. వెంటనే ఆ టైంలో మోడీకి ఫోన్ చేసాడు. మోడీ ఫోన్ ఎత్తగానే ఒబామా అక్కడ నెలకొన్న పరిస్థితి గురించి చెప్పాడు. మోడీ అందుకు... డోంట్ వర్రీ ఒబామా... ఆ శబ్దం విమానాలది కాదు... మీరుంటున్న ఐటిసి హోటల్ చుట్టూ అసాధారణ భద్రత ఏర్పాటు చేశాం... మీకు రక్షణ కవచంగా ఉన్న ఫోర్స్‌దే ఆ సౌండ్ అని చెప్పాడు. దాంతో ఒబామా ఊపిరి పీల్చుకుని పడుకున్నాడు.

★★★★★

ఎర్రకోట వద్ద అంగరంగవైభవంగా రిపబ్లిక్‌డే వేడుకలు జరుగుతున్నాయి. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఒబామా, ప్రధాని మోడీ, ఇతర నేతలంతా జాతీయ పతాకానికి వందనం చేశారు. అనంతరం మన సైనిక సంపత్తి ప్రదర్శన, సైనికుల విన్యాసాలు, ఒంటెలు, అశ్వదళ ప్రదర్శన, శకటాల ప్రదర్శనలు ముగిసాయి. చివరిగా మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేయసాగారు. ఇప్పుడు ప్రపంచంలోనే ఏ దేశానికి లేని అసాధారణ ఆర్మీ 'నెల్లూరు బ్లడ్ డెవిల్స్ ఫోర్స్' ప్రదర్శనను కళ్లార్పకుండా చూడండని చెప్పారు. అందరూ చూస్తుండగానే అందరి కళ్ల ముందు నుండి 'జుమ్...' అనే సౌండ్‌తో ఒక ఫోర్స్ గాల్లోనే వెళ్లిపోయింది. రాజశేఖర్ హీరోగా నటించిన ఓ సినిమాలో బ్రహ్మానందం పెళ్లి చూపులకు వెళితే 'మెరుపుతీగ ఒకసారి ఇటొచ్చిపోమ్మా' అని మల్లిఖార్జునరావు అనగానే పెళ్లికూతురు సెకండ్‌లో వచ్చి పోతుంటుంది. ఈ ఫోర్స్ కూడా అలాగే వచ్చి పోయింది. ఒబామాకు ఆశ్చర్యమేసింది. మోడీతో... సార్, ఇప్పుడొచ్చిన ఫోర్స్‌ను నేను సరిగా చూడలేదు. మనుషులు కాదు, జంతువులు కాదు, అదేం ఫోర్సో నాకు అర్థం కావడం లేదు. ఆ ఫోర్స్‌ను ఒకసారి నిదానంగా చూపించండని అడిగాడు. అప్పుడు మోడీ తన సెల్‌ఫోన్ తీసి తాను షూట్ చేసిన "నెల్లూరు బ్లడ్ డెవిల్స్ ఫోర్స్" ప్రదర్శనను స్లోమోడ్‌లో పెట్టి ఒబామాకు చూపించాడు. కోట్ల సంఖ్యలో వున్న సన్న జీవులు కొన్ని చాలా క్రమశిక్షణగా లైన్‌లో పోసాగాయి. వాటిని చూసి ఒబామా ఆశ్చర్యపోయాడు. ఈ ఫోర్సేంటీ, ఈ జీవులేంటి అని మోడీని అడిగాడు. అప్పుడు మోడీ చెప్పడం మొదలుపెట్టాడు. మీకు అసాధారణ భద్రత కల్పించామన్నాంగా... ఈ ఫోర్స్‌తోనే. రాత్రి హోటల్ వద్ద 'జుయ్' మంటూ శబ్దం వచ్చింది కూడా ఈ ఫోర్స్ వల్లే! మీరు చూసిన ఆ సన్నజీవులను నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలంటారు. ప్రపంచంలో ఒక్క నెల్లూరులో మాత్రమే ఇవి దొరుకుతాయి. వాస్తవానికి ఇవి నెల్లూరు ప్రజల రక్తాన్ని పీల్చి బ్రతుకుతుండేవి. ముదురుదోమల నిర్మూలనకంటూ నెల్లూరు కార్పొరేషన్ వాళ్లు కోట్ల రూపాయలు తగలేస్తుండేవాళ్లు. అయితే చివరికి కోట్లుపోయి నెల్లూరు మేయర్ ఒంటి మీద కోటు మిగిలింది గాని ఈ దోమల నిర్మూలన పూర్తి కాలేదు, సరికదా అవి మరింతగా బలిసాయి. దోమల నిర్మూలనకు ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా దండగ అనేది తేలిపోయింది. ఈ సమయంలో అదే నగరానికి చెందిన మాజీఎమ్మెల్యే, స్టైల్ ఆఫ్ సింహపురి బిరుదాంకితుడు ఆనం వివేకానందరెడ్డి (64+) ప్రభుత్వానికొక సలహా ఇచ్చాడు. మనిషి సింహాలు, పులులు, మొసళ్లు, అనకొండలు వంటి క్రూరజీవాలనే మచ్చిక చేసుకుని తన అవసరాలకు వాడుకుంటున్నప్పుడు నెల్లూరు ముదురుదోమలను కూడా మచ్చిక చేసుకోలేమా... వాటికి శిక్షణ ఇచ్చి మన మిలిటరీకి వాడుకుంటే బాగుంటుందని చెప్పాడు. ఆయన సలహా బాగుందనిపించింది. ఈమేరకు వారానికి నాలుగుటన్నుల దాకా దోమలను రాజస్థాన్‌లోని బికనీర్ ఆర్మీ బేస్ క్యాంప్‌కు పంపిస్తాం... అక్కడ వీటికి సైనిక శిక్షణ ఉంటుంది. రెండురోజుల శిక్షణ అనంతరం ఒక్కో ట్రిప్‌లో తెచ్చిన వాటిని ఒక బెటాలియన్‌గా ఏర్పాటు చేసి సరిహద్దుల్లో మోహరిస్తాం. అలాగే దేశ అంతర్గత భద్రతకు, మీలాంటి విఐపిల రక్షణకు కూడా ఈ బెటాలి యన్‌లను వినియోగిస్తున్నాం. ఇప్పటి వరకు నెల్లూరు నుండి 20టన్నుల దాకా దోమలొచ్చాయి. వాటిని 10బెటాలియన్‌లుగా ఏర్పాటు చేసాము. దోమల ఆయుష్షు తక్కువ రోజులే కాబట్టి చనిపోయిన దోమల స్థానంలో కొత్తగా వచ్చేవాటిని రీప్లేస్ చేస్తుంటాం అని చెప్పాడు. ఒబామా వుండి... మరి నెల్లూరులో దోమల ఉత్పత్తి ఆగిపోతే అని సందేహంగా అడిగాడు. అందుకు మోడీ.. మీ నయాగారా జలపాతం, మా గంగా నది ఎప్పుడూ ఎలా ప్రవహిస్తుంటాయో, నెల్లూరులో కూడా దోమల ఉత్పత్తి అలాగే జరుగుతుంటుంది. నెల్లూరులో నెలకొన్న వాతావరణం అలాంటిది అని చెప్పాడు. మోడీ చెప్పింది విని... ఇప్పటిదాకా అమెరికాను మించిన అగ్రరాజ్యం లేదనుకున్నాం... కాని ఈ భారతదేశం వాళ్లు మమ్మల్ని మించిపోయారే అని మనసులో అనుకోసాగాడు.

(... ఇంకా వుంది)

## కదంబం

### ఏకులు పెట్టిన బుట్ట!

గుర్రాల రమణయ్య
నెల్లూరు. 9963921943

పక్షిగూటిని చూసినప్పుడల్లా
నీడలేని ఆకాశం కింద నించొన్న బాధ
క్షణమైనా నిలిచోనీయరు
కిరాయి వడగళ్లవాన కురిసేవేళ
నిప్పు గాలై ఎండలు మండేవేళ
గుండె నేలలో నేరుగా దిగే గునపాలు
ఆచ్ఛాదనలేని బతుకులో
అద్దె యింటి గోడల మీదుగా
వచ్చి వెళ్లే ఋతుపవనాలు
మందులేని గాయం
అద్దెయింటి సావాసం
ఒకటంటే ఎక్కువ
అరచెబితే లోకువ
నోట్లో నాలుక తిరక్కముందే
చప్పున పెరిగిపోయే బాడుగ
కొత్త యింటి యజమానైనా
తోక తొక్కిన తాచే
అద్దెకున్న పాపానికి
చచ్చినట్టు వినవలసిన ఉపదేశాలు
పెడచెవిని బెడితే
తలకెత్తుకోవాల్సిన కష్టాలు
కో అంటే కోటి పలకరిస్తాయి
మనం నోరు విప్పితే చాలు
అగ్రహారం తమ్మళిజోస్యంలా
మనల్నే పరిహసిస్తుంది
అచ్చివచ్చిన యిల్లైనా
సొంతిల్లు లేని దరిద్రుడి ముందు
ఒంటికాలిపై నిలుస్తుంది!

ఏకులు పెట్టిన బుట్ట
- ఎన్ని కష్టాలైనా భరించేవాడు
అగ్రహారం తమ్మళిజోస్యంలా
- అధికుడి ముందు చిన్నమాటలు మాట్లాడటం

## 'దాట్ల' సాహిత్య పురస్కారాలు

ప్రముఖకవి డా॥ ఎన్.గోపి, ప్రముఖ కథకులు ఏ.ఎన్.జగన్నాథశర్మలకు 2015 సాహిత్య పురస్కారాలను అందజేయడానికి 'దాట్ల దేవదానం రాజు సాహితీ సంస్థ' నిర్ణయించింది. మార్చి 22తేదీన యానాంలో జరిగే సభలో ఇరువురికి పురస్కార ప్రదానం జరుగుతుంది. ఈ పురస్కారం కింద ఒక్కొక్కరికి పదివేలు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారు.

## వైభవంగా రంగడి బంగారు గరుడసేవ

వ్యాసపూర్ణిమ సందర్భంగా నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ స్వామివారికి బంగారు గరుడసేవను వైభవంగా నిర్వహించారు. స్వామివారికి తిరుమంజనం, అభిషేకాలు, విశేషపూజలను ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిఘింద సుదర్శనాచార్యులు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని శ్రీ స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయకమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి పర్యవేక్షించారు.

## టెలికం సలహామండలి సభ్యుల నియామకం

బిఎస్ఎన్ఎల్ అడ్వయిజరీ కమిటీకి అయిదు మంది సభ్యులతో కమిటీని నియమించినట్లు నెల్లూరు ఎంపీ కార్యాలయం మంగళవారం ప్రకటించింది. నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రతిపాదించిన చంద్రమౌళి, కాయల సురేష్‌బాబు, రాజశేఖర్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, కిలారి శ్రీనివాసులనాయుడులను టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా నియమిస్తూ బిఎస్ఎన్ఎల్ జిఎంకు ఉత్తర్వులు అందాయని కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

## 'పటాస్' విజయోత్సవ ర్యాలీ



'పటాస్' చిత్రం విజయవంతం అయిన సందర్భంగా ఆ చిత్ర యూనిట్ రాష్ట్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఇటీవల తెలుగుయువత నేత పమిడి రవికుమార్‌చౌదరి ఆధ్వర్యంలో మాజీమంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి, ఈ చిత్ర పంపిణీదారులు హరి పిక్చర్స్ అధినేత జి.హరికుమార్, హంసా సురేష్ పర్యవేక్షణలో నెల్లూరు నగరంలో విజయోత్సవ ర్యాలీ ఏర్పాటు చేశారు. నగరంలోని అయ్యప్పగుడి సెంటర్‌లో చిత్రయూనిట్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభిమానులు కళ్యాణ్‌రామ్‌ను భారీ గజమాలతో అభినందించారు. సుమారు 700మందితో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఆర్ఆర్‌వీధిలోని ఎన్టీఆర్ విగ్రహం వరకు సాగిన ఈ ర్యాలీలో భారీగా బాణాసంచా కాలుస్తూ పూలు చల్లుతూ అభిమానులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్ఆర్ వీధిలోని ఎన్టీఆర్ విగ్రహంకు జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నారా లోకేష్ సేవాసమితి జిల్లా గౌరవాధ్యక్షులు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, కళ్యాణ్‌రామ్, నిర్మాత దిల్‌రాజు తదితరులు గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ చిత్ర బృందం సిరి మల్టిప్లెక్స్ థియేటర్‌కు చేరుకొని చిత్రాన్ని చూస్తున్న ప్రేక్షకులను పలకరించింది. ఇది నందమూరి నామసంవత్సరం అని, కొత్త సంవత్సరం నా సినిమాతో హిట్ కొట్టానని, తమ్ముడు ఎన్టీఆర్, ఆ తర్వాత బాబాయ్ నటించిన చిత్రం సూపర్‌డూపర్ హిట్ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ యాత్రలో దర్శకుడు రావిళ్ళపూడి అనిల్, సాయికుమార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పంటలను కాపాడండి

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ నెల 4వ తేదీన నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని కొమ్మరపూడి గ్రామాన్ని సందర్శించారు. రైతుల విజ్ఞప్తి మేరకు స్వయంగా పంటచేల వద్దకు వెళ్లి పొలాలను పరిశీలించారు. నీళ్లు లేక తమ పంటలు ఎండిపోతున్నాయని, తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే అక్కడ నుండే నేరుగా కలెక్టర్‌తో ఈ సమస్యపై మాట్లాడారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ ఈ గ్రామంలో సుమారు 500ఎకరాలలో వరి సాగు చేస్తున్నారని, అందరూ చిన్నా, సన్నకారు రైతులేనని, సకాలంలో వర్షాలు రాక, నీళ్ళ లేక పంటలు ఎండిపోయే పరిస్థితికి వచ్చిందన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి వందలాది ఎకరాల్లో పంటలను కాపాడేందుకు తక్షణం నాలుగు బోర్లు మంజూరు చేయాలని కోరారు. పంటలను కాపాడడంలో తాను రైతులకు అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ శ్రీధర్, స్థానికులు ఎం.మస్తాన్, పచ్చిపాల శ్రీనివాసులు, వేణు, అంబటి మురళి, వెంకటరత్నం నాయుడు, సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

# అనాధలను ఆదుకుంటే జన్మ చరితార్ధం



అనాధలను, అభాగ్యులను ఆదుకుని వారికి చేయూతనందిస్తే జన్మ చరితార్థమని ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్లీపింగ్ చిల్డ్రన్ అరౌండ్ ద వరల్డ్(ఎస్‌పిఎడబ్ల్యూ) కార్యక్రమాల్లో భాగంగా నెల్లూరురూరల్ మండలంలోని కనుపర్తిపాడు జడ్పీ హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు సామాగ్రి కిట్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగానే ఈ సంవత్సరం కూడా జిల్లాలోని రూరల్, అర్బన్ ప్రాంతాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులకు కిట్స్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని అందరూ సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. నేటి బాలలే రేపటి పౌరలన్న నానుడిని స్ఫూర్తిగా తీసుకుని నాలుగేళ్లుగా విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు.

విద్యార్థుల శ్రేయస్సు కోసం సంపూర్ణ సహాయసహకారాలు అందించడంతో పాటు ఆధ్యాత్మిక దైవ సంబంధ కార్యక్రమాలకు చేయూతనిస్తున్న వేమిరెడ్డిని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రశంసలతో ముంచెత్తారు. నిర్వాహక కమిటి సభ్యుడు సాయిభాస్కర్‌రెడ్డి, మాజీసర్పంచ్ వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి, కెనడాకు చెందిన ఏడు మంది సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకయ్య పాల్గొన్నారు.

# కళలను బతికించుకోవాలి - యస్.పి.బాలు



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, వెన్నెలకంటి

ఆధునిక జీవనంలో కళలను బతికించుకోవాలని సినీ నేపథ్య గాయకులు పద్మశ్రీ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. సింహపురి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న హరికథా సప్తాహంలో భాగంగా బుధవారం రాత్రి నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నేడు కళలు కనుమరుగవుతున్నాయని, ఇది చాలా దారుణమైన సంఘటనగా గుర్తించాలన్నారు. హరికథలు లాంటి ప్రక్రియ కనుమరుగవుతున్నా మైపాడు రాజా లాంటి యువకులు ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసి వాటికి జీవం పోయడం అభినందనీయమన్నారు. తన తండ్రి సాంబమూర్తి విగ్రహాన్ని నెల్లూరులో ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసేందుకు అనుమతి లభించిందన్నారు. అనంతరం కూచిపూడి నృత్యం చేసిన చిన్నారులను సన్మానించారు. శ్రీశైలంకు చెందిన భాగవతార్ శర్మను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ రచయిత వెన్నెలకంటి, నలుబోలు బలరామయ్యనాయుడు, బి.వి.నరశింహం, మునికుమార్, ఎస్.నరశింహారెడ్డి, కె.రవీంద్రరెడ్డి పాల్గొన్నారు. అనంతరం తిరుపతికి చెందిన వెంకటేశ్వర్లు భాగవతార్ సుందరకాండ హరికథాగానం చేశారు.

# విధి నిర్వహణలో జాజిమల్లి... అత్తిపల్లి



పరంధామిరెడ్డి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

విద్యుత్‌శాఖలో 30 ఏళ్ల పాటు నిరంతరాయంగా సేవలందిస్తూ, గత నెల 31వ తేదీన ఇందుకూరుపేట మండలం మైపాడు ఏఇగా ఉద్యోగ విరమణ చేసిన అత్తిపల్లి పరంధామిరెడ్డి వీడ్కోలు సత్కార సభను ఈనెల 4వతేదీన నెల్లూరు, దర్గామిట్టలోని స్వర్ణవేదిక కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాన్స్‌కో రిటైర్డ్ సిఎండి గోపాలరెడ్డితో పాటు ట్రాన్స్‌కో తిరుపతి జోన్ సిఇ నందకుమార్, నెల్లూరు ఎస్‌ఇ నాగశయనరావు, కడప ఎస్‌ఇ ఎన్.సుబ్బరాజులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యుత్ శాఖలో పరంధామరెడ్డి చేసిన కృషిని కొనియాడారు. అలాగే ట్రాన్స్‌కో ఉద్యోగుల యూనియన్ నాయకులు, మైపాడు గ్రామస్తులు కూడా పరంధామ రెడ్డి పనితీరును, ఆయనతో వున్న పరిచయాలను సభలో వివరించారు.

ఏఇ స్థాయిలో పరంధామరెడ్డి ఉద్యోగ విరమణ చేసినా ఆయన వీడ్కోలు సభకు విద్యుత్ ఉద్యోగులు పెద్దసంఖ్యలో తరలివచ్చి శాలువాలు, పూలమాలలు, బొకేలతో ఆయనను, ఆయన సతీమణిని ఘనంగా సత్కరించడం విశేషం.

# అక్రమాల సక్రమానికి ప్రభుత్వం పచ్చజెండా!



రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక సంస్థలు కూడా ఆదాయం లేక నీరసించిపోతున్నాయి. ప్రభుత్వానికి గాని, స్థానిక సంస్థలకు గాని కేంద్రప్రభుత్వం నుండి చిల్లిగవ్వ రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వమే అడుక్కునే పరిస్థితిలో వుంది. చంద్రబాబు ప్రభుత్వ విధానాలు కూడా ఆదాయాన్ని పెంచుకునే కంటే ఉన్న మిగులును పైపై మెరుగులకే ఖర్చు చేస్తుంది. స్థానిక సంస్థలలో ఒక్క పందిని పట్టడానికి కూడా నిధులు లేని పరిస్థితి.

ఇలాంటి తరుణంలో ఆదాయాన్ని రాబట్టే క్రమంలో ప్రభుత్వం అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణను తెరమీదకు తెచ్చింది. అప్రూవల్స్ లేకుండా, తీసుకున్న అప్రూవల్స్‌కు విరుద్ధంగా కట్టిన భవనాలను అపరాధరుసుం కట్టించుకుని క్రమబద్ధీకరించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. అయితే అనుమతులు వున్న లే అవుట్లలోని అక్రమ నిర్మాణాలను మాత్రమే క్రమబద్ధీకరించాలనే నిబంధన పెట్టారు. బిఆర్‌ఎస్‌ను అమలులోకి తేవడంతో అక్రమంగా భవనాలు నిర్మించుకున్న వాళ్లు ఊపిరి పీల్చుకుంటున్నారు. ప్రస్తుతం అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకే అనుమతినిచ్చారు. అక్రమ లే అవుట్లను కూడా క్రమబద్ధీకరిస్తే ప్రభుత్వంతో పాటు స్థానిక సంస్థల ఆదాయం కూడా గణనీయంగా పెరిగే అవకాశముంది.

2007లో అప్పటి వై.యస్. ప్రభుత్వం బిఆర్‌ఎస్, ఎల్‌ఆర్‌ఎస్‌లకు అనుమతించింది. నెల్లూరునగరంలో 2010 వరకు ఈ స్కీంల క్రింద 3వేలమందికి దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు 1500 మంది దరఖాస్తులను పరిష్కరించారు. ఇంకా 1500 దరఖాస్తులు పెండింగ్‌లోనే వున్నాయి. కాగా 2010 నుండి ఇప్పటివరకు నగరంలో వేలసంఖ్యలోనే భవనాలు, అపార్ట్‌మెంట్లు వెలిసాయి. వీళ్లంతా కూడా ప్రభుత్వం మళ్లీ బిఆర్‌ఎస్ ఇస్తుందని, రెగ్యులరైజ్ చేసుకుందామనే ఎదురుచూస్తున్నారు. అయితే ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా కట్టారంటూ అన్నమయ్య సర్కిల్‌లో ఓ భవనాన్ని కూల్చివేశారు. అప్పటి నుండి నగరంలోని కొత్త భవన యజమానులలో గుబులు పట్టుకుంది. ఎట్టకేలకు ప్రభుత్వం భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. దీంతో భవన యజమానుల్లో ఆందోళన తొలగింది. అదే సమయంలో రూపాయి ఆదాయం లేక ఐసియులో పేషంట్‌లా తయారైన కార్పొరేషన్‌కు కొంత ఆదాయం జమపడే అవకాశం వచ్చినట్లయ్యింది.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com